

జగన్ విధ్వంసాన్ని అధిగమించి, సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు. అభివృద్ధి చేసి వచ్చే ఆదాయంతోనే సంక్షేమం కొనసాగాలి. అప్పు చేసి ఖర్చు చేయడం పరిపాలన కాదు. ప్రజల ఆశీర్వాదంతో ఏడాదిగా సుదీర్ఘ సుపరిపాలన అందిస్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 07.10.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 171 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




## మేధోమధనంతో..
# మెరుగైన సేవలు

**వాట్సప్ గవర్నెన్స్ వినియోగం మరింత పెరగాలి**

- పౌర సేవల్లో సంతృప్తి స్థాయే ముఖ్యం
- ప్రభుత్వ శాఖల పనితీరుపై నెలవారీ ఆడిట్ జరగాలి
- ఆర్టీజీఎస్, పౌర సేవలపై సమీక్షలో సీఎం చంద్రబాబు
- డ్రోన్ సిటీకి ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన
- డిసెంబరులో డ్రోన్ షో నిర్వహించాలని నిర్ణయం

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్)**: వివిధ ప్రభుత్వ శాఖలు అందిస్తున్న పౌర సేవలు మరింత మెరుగు పరిచేందుకు అధికారులు మేధోమధనం జరపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పౌర సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆర్టీజీఎస్, పౌర సేవలపై ప్రజల సంతృప్తి స్థాయిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు సమాచార శాఖ మంత్రి కె.పార్ధసారధి, సీఎస్ కే.విజయానంద్, ఐటీ, ఆర్టీజీఎస్, సీఎంఓ ఉన్నతాధికారులు హాజరయ్యారు.
వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌర సేవల్లో ప్రజల సంతృప్త స్థాయి పెంచడంపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం ప్రజల నుంచి ఐవీఆర్ఎస్‌తో పాటు క్యూఆర్ కోడ్ ద్వారా వెల్లడిస్తున్న అభిప్రాయాల్లో సానుకూలత ఏ స్థాయిలో ఉంది, అసంతృప్తి ఎక్కడెక్కడ ఉందన్న సమాచారాన్ని క్రోడీకరించాలని సూచించారు. తద్వారా సమస్య మూలాలను కనుగొని వాటిని వేగంగా పరిష్కరించటం ద్వారా ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత మెరుగుపరుచుకోవచ్చని సీఎం పేర్కొన్నారు. ఆర్టీజీఎస్ డేటా లేక్‌లో అపారమైన సమాచారం నిక్షిప్తమై ఉందని తద్వారా డేటా ఆధారిత నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ఆస్కారం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రం యూనిట్‌గా ప్రభుత్వం 19 విభాగాల ద్వారా అందిస్తున్న సేవలపై ప్రతీ రోజూ దృష్టి సారించాలని మిగతా 2లో...

## విద్యార్థుల కలలకు రెక్కలు తొడుగుదాం



**పావలా వడ్డీకే అందరికీ విదేశీ విద్యా రుణాలు**

**విదేశాల్లో చదవాలనుకునేవారికి ప్రభుత్వ హామీ**

**అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చడమే లక్ష్యం**

**సంక్షేమ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలోని విద్యార్థులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరో వరం ఇవ్వాలని నిర్ణయించారు. విదేశాల్లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలనుకునే ప్రతీ విద్యార్థికి పావలా వడ్డీకే బ్యాంకు రుణాలు ఇచ్చేలా సరికొత్త పథకాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎలాంటి పరిమితి లేకుండా, ఎంతమంది విద్యార్థులైనా చదువుకునే వీలుండాలని చెప్పారు. అలాగే దేశంలో ఐఐటీ, ఐఐఎం నీట్ వంటి ఉన్నత విద్య చదవాలనుకునే వారికి కూడా ఈ పథకం మిగతా 2లో...

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి



**విశాఖలో మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్ ఏర్పాటు చేయండి**

**రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజాతో మంత్రి లోకేష్ భేటీ**

**ముంబయి:** రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ముంబయిలో భేటీ అయ్యారు. రెసిడెన్షియల్, కమర్షియల్ రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, రిటైల్ మాల్స్, రిటైల్స్ స్టోర్స్, ఐటీ సెజ్ లకు పవర్ డిస్ట్రిబ్యూషన్ వ్యాపార రంగంలో పేరెన్నికగన్న రహేజా గ్రూప్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 12వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రహేజా గ్రూప్ నకు చెందిన 3 లిస్టెడ్ ఎన్టైటిల్స్ మార్కెట్ క్యాపిటల్ రూ. 100 బిలియన్లకు పైగా ఉంది. భారత్ 54 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్‌ను అభివృద్ధి చేసిన రహేజా గ్రూప్ దేశంలో 2వ అతిపెద్ద కమర్షియల్ స్పేస్ డెవలపర్ గా నిలచింది. నీల్ రహేజాతో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖపట్నంలో 100-150 ఎకరాల విస్తీర్ణంలో మిగతా 2లో...

## మాస్టర్ ప్లాన్ అమలులో మార్పులు చేర్పులు అనివార్యం



- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్)** సామాజికంగా రాజకీయంగా సాంస్కృతికంగా అన్ని రకాలుగా ప్రాధాన్యతను సంతరించుకున్న ప్రాంతం తెనాలి ప్రాంతమని ఔటర్ రింగ్ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, పట్టణ మాస్టర్ ప్లాన్ అంశాల సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధికారులకు పలు సూచనలు చేశారు.
స్థానిక పురపాలక సంఘకార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సోమవారం మధ్యాహ్నం పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్ విజన్ 2047,డాక్యుమెంట్స్ తయారు, అంశంపై ప్రజలు,వివిధ కమ్యూనిటీ విభాగాల సలహాలు తీసుకునేందుకు, ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీరామ అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో, 2047 విజన్ ద్వారా అభివృద్ధి చేసే అంశాలను స్లైడ్ షో ద్వారా అధికారులు వివరించారు. పట్టణ అభివృద్ధిలో ప్రాధాన్యతను సంతరించుకునె తొమ్మిది అంశాలను ప్రస్తావించారు. సిఆర్డిఏ పరిధిలో ఆరు జిల్లాలు, 56 మండలాలు, భౌతిక మౌలిక సదుపాయాలు, పర్యావరణం,ఆర్థిక వ్యవస్థ, గ్రామీణ ఉత్పత్తులు, సాంస్కృతిక చారిత్రక అంశాలు, సామాజిక మౌలిక సదుపాయాలు గురించి అధికారులు వివరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శతాధిక వత్సరాల పట్టణ అభివృద్ధి చరిత్రలో, పురపాలక సంఘానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. సి ఆర్ డి ఏ పరిధిలో పట్టణంలో ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్, మాస్టర్ ప్లాన్‌లో చూపించిన మిగతా 2లో...

# ఆందోళన అక్కర్లేదు



సోమవారం అనకాపల్లి పట్టణంలో మందుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ ఇన్స్‌పెక్టర్లు

- తనిఖీలు కొనసాగిస్తున్నాం
- మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలోని కల్తీ దగ్గు మందు రాష్ట్రానికి సరఫరా కాలేదు
- డీజీ హెచ్ఎస్ సూచనల మేరకు వైద్యులు వ్యవహరించేలా అప్రమత్తం చేయాలి
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** : మధ్యప్రదేశ్, రాజస్థాన్ లలో 12 మంది చిన్నారుల మరణాలకు దారితీసిన కల్తీ దగ్గు మందు సదరు కంపెనీ నుంచి రాష్ట్రానికి సరఫరా కాలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. ఔషధ దుకాణాల వారికి కానీ, ప్రభుత్వాసుపత్రులకు కానీ సదరు కంపెనీ దగ్గు మందు పంపిణీ జరగలేదని వెల్లడించారు. తాజా పరిణామాలపై మంత్రి సత్యకుమార్‌కు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, రాష్ట్ర ఔషధ నియంత్రణ పరిపాలనా ఇంచార్జి డైరెక్టర్ జనరల్, రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరీషా నివేదికలు అందచేశారు.

## పరుగులు పెడుతున్న పసిడి

- 10 గ్రాములు ఏ 1.23 లక్షలు
- రికార్డ్ స్థాయిలో ధర నమోదు
- అమెరికా ఆర్థిక వ్యవస్థ కారణమంటున్న నిపుణులు

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : బంగారం ధర దూసుకెళ్తోంది. రోజుకో కొత్త రికార్డు సృష్టిస్తూ అందనంత ఎత్తుకు చేరుకుంటోంది. ట్రంప్ టారిఫ్‌లు, అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితులు, కేంద్రీయ బ్యాంకుల కొనుగోళ్లు కలిసి పుత్తడికి ఇన్నాళ్లు డిమాండ్ పెంచగా.. తాజాగా అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుండడంతో బంగారం ధరకు పట్టపగ్గాల్లేకుండా పోయింది. మిగతా 2లో...



## టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం విజయవాడ భవానీపురంలోని హరిత బెరంపార్క్ లో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ గా మందలపు రవికుమార్ తో మంత్రి కందుల దుర్గేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. జ్యోతి ప్రజ్వలనతో పదవీ బాధ్యత ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రారంభమైంది. సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తారన్న నమ్మకంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మిగతా 2లో...



## టమోటా రైతులకు అండ



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టమోటా ధరలపై రైతులకు భరోసా ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు, రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆదివారం రాప్తాడు మార్కెట్‌లో టమోటా ధరలు గరిష్టం రూ. 18, కనిష్టం రూ. 9, మోడల్ ధర రూ. 12గా ఉన్నాయి. 30-40 మెట్రిక్ టన్నుల సరుకు పత్తికొండ మార్కెట్‌కు వస్తుందని, దసరా సెలవుల కారణంగా 10 టన్నులు అదనంగా చేరినట్లు, రోడ్లపై 2వ గ్రేడ్ క్వాలిటీ టమాటాలు వేసి గందరగోళం సృష్టించబడినట్లు మంత్రి వివరించారు. ఇప్పటివరకు 10 మెట్రిక్ టన్నుల టమోటాలను వివిధ రైతు బజార్లకు పంపించామని, ఈ రోజు పత్తికొండ మార్కెట్ నుంచి 10 మెట్రిక్ టన్నులు చిత్తూరు ప్రొసెసింగ్ యూనిట్‌కు, 15 మెట్రిక్ టన్నులు రైతు బజార్లకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు సరుకు వర్షాల కారణంగా తగ్గిన నేపథ్యంలో, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల టమాటా అమ్మకాలు మందగించాయని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. ప్రస్తుతం టమాటాలకు ట్రెండింగ్ ధర బట్టి రైతులకు మంచి ధర లభిస్తోంది. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులను ఆదుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

# పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి

- 2027లో గౌరవ ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం
- పోలవరం పనుల ప్రగతిపై కేంద్రం సంతృప్తి
- ఢిల్లీలో సమీక్ష సమావేశం అనంతరం మంత్రి రామానాయుడు వివరాలు వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** : పడకేసిన 'పోలవరం' పనుల ను పట్టాలెక్కించి, పరుగులు తీయిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ పనితీరు పట్ల కేంద్రం పూర్తి సంతృప్తిని వ్యక్తం చేసినట్లు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
ఢిల్లీలో సోమవారం కేంద్ర జల శక్తి మంత్రి పాటిల్ ఆధ్వర్యంలో జరిగిన పోలవరం పనుల సమీక్షా సమావేశం వివరాలను మంత్రి మీడియాకు వివరించారు. 2019-24 మధ్య జగన్ ఐదేళ్ల పాలనలో పోలవరానికి జరిగిన నష్టాన్ని, విధ్వంసాన్ని, 2024 లో కూటమి ప్రభుత్వ అధికారం లోకి వచ్చిన తర్వాత పరిస్థితులను చక్కదిద్ది.. పనులను పరుగులు పెట్టిస్తున్న నేటి స్థితి వరకు సమీక్షలో చర్చించామన్నారు. కాలావధి లక్ష్యాన్ని నిర్ణయించుకుని 2027 డిసెంబర్ కల్లా.. వీలైతే పుష్కరాలకు ముందు అంటే అదే ఏడాది జూన్ లోనే పోలవరం పూర్తి చేసి ప్రధాని మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పాటిల్ స్వాగతించారు. సంతృప్తిని వ్యక్తం చేశారు.
ఆంధ్రప్రదేశ్ కి జీవనాడి, జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్దేశిత గడువులో పూర్తి చేయడానికి తమ వంతు మిగతా 2లో...

## రాష్ట్రానికి నిధులు ఇవ్వండి



**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్రానికి రావాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నాడు విజయవాడ వివంత హెూటల్ లో సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలే ని మంత్రి డా.డోలా బాల వీరాంజ నేయస్వామి కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మంత్రి డా.స్వామి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పలు అభివృద్ధి, సంక్షేమ అంశాలపై చర్చించారు. రాష్ట్రానికి రావలసిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు రూ. 34 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. అంబేద్కర్ విదేశీ విద్య పథకానికి కేంద్రం 50 శాతం సబ్సిడీ నిధులు ఇవ్వాలని మంత్రి స్వామి కోరారు. రాష్ట్రంలో ఎస్సి విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించామని మంత్రి స్వామి కేంద్ర మంత్రికి వివరించారు. నెల రోజుల్లో అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి చెప్పారని, అన్ని అంశాలకు ఆయన సానుకూలత తెలిపినట్లు మంత్రి డా. స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కి అన్ని విధాల సహకరిస్తున్న ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

## మేథోమథనంతో మెరుగైన సేవలు



(మొదటి పేజీ తరువాయి)

అలాగే ప్రతీ 15 రోజులకూ ఒకసారి సమాచార సేకరణ చేయాలని సూచించారు. వీటిపై ప్రతీ నెలా ఆడిట్ నిర్వహించి ప్రతీ మూడు నెలలకూ ఓ సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. దీనికోసం రాష్ట్రస్థాయితో పాటు జిల్లా, నియోజకవర్గం స్థాయిలో సమాచారం తీసుకుని విశ్లేషించాలని పేర్కొన్నారు. 15 నెలలుగా ప్రజల్లో సంతృప్తి స్థాయి క్రమంగా మెరుగు పడుతోందని ఇది మరింత పెరగాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవల్లో ప్రజలు ఎలా స్పందిస్తున్నారన్నదే ప్రధాన అంశమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత పాలకుల నిర్వాకం కారణంగా రెవెన్యూ రికార్డులు తారుమారై వివాదాలు పెరిగాయని... వాటిని సరిచేస్తున్నట్టు సీఎం తెలిపారు.

**ప్రధాని మోదీ చేతుల మీదుగా డ్రోన్ సిటీ శంకుస్థాపన :** ప్రజలకు అందిస్తున్న సేవల ప్రమాణాలను మెరుగుపరుచుకుని సంతృప్త స్థాయిని పెంచుకోవాలని సీఎం సూచించారు. ప్రభుత్వ శాఖలు, అధికారులు, ఉద్యోగుల పనితీరు విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో నైపుణ్యాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల్లో కొందరు సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందడం లేదని, అలాంటివారి అర్హతలు పరిశీలించి వారు కూడా ప్రభుత్వ పథకాల ఫలాలు పొందేలా చూడాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్న 730 సేవల వినియోగం మరింతగా పెంచేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ సేవలు వాట్సప్ గవర్నెన్సు ద్వారా సులభంగా అందుతాయనే భావన ప్రజల్లో విస్తృతమైతే ఎక్కువగా వినియోగించే ఆస్కారం ఉంటుందన్నారు. దీనికి తగినట్టుగా ప్రజల్లో అవగాహన మరింత పెంచాలని సూచించారు. డ్రోన్ల వినియోగానికి సంబంధించి ప్రభుత్వ విభాగాలతో పాటు ప్రైవేటు వినియోగం కూడా పెరిగేందుకు ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైద్య రంగంతో పాటు వ్యవసాయ రంగంలోనూ డ్రోన్ల వినియోగం మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. డిసెంబరులో డ్రోన్ షో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 16 తేదీన ప్రధాని మోదీ శ్రీశైలం పర్యటనకు వస్తున్న దృష్ట్యా డ్రోన్ సిటీకి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. సీసీ కెమెరాలను ట్రాఫిక్ సహా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సమర్ధవంతంగా వినియోగించుకోవాలన్నారు.

## మాస్టర్ ప్లాన్ అమలులో మార్పులు చేర్పులు అనివార్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకారం , రూపకల్పనకు,చాలా ప్రతిభంధకాలు ఉంటాయని, వాటిని అధిగమించాల్సిన అవసరాన్ని వివరించారు. పురపాలక సంఘం మాస్టర్ ప్లాన్, 2006, 2012, 2019లో పెద్ద మార్పులు ఏమి లేవు అన్నారు. ఊహాజనితమైన అంశాలు ఆచరణలోకి తెచ్చే విషయంలొ మరికొన్ని మార్పులకు తావిస్తాయన్నారు. పట్టణంలోని అంతర్గత సమస్యలను వివరిస్తు, పట్టణంలో మూడు, పంట కాలువలు ద్వారా, ప్రవహించేనీరు, దిగువ 150,గ్రామాల ప్రజలు, మంచినీరుగా వాడుకునే నీరు , పట్టణంలోని డ్రైనేజీ మురుగు,ఏదో విధంగా కలవడం ద్వారా మలిన మవుతున్నాయని, ఈ సమస్యకు పరిష్కారం చూడాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా తెనాలి కి ఉన్న ప్రాధాన్యత క్రమంలో, పట్టణ అభివృద్ధికి ప్రధానంగా టూరిజం శాఖ ద్వారా ఆదాయ వనరులు, సాంస్కృతిక రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తమ సుదీర్ఘ ప్రసంగంలో వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, టౌన్ ప్లానింగ్ అధికారులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఖాలేదా నశీం, పలువురు వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పరుగులు పెడుతున్న పసిడి



(మొదటి పేజీ తరువాయి)

దీంతో అంతర్జాతీయ విపణిలో ఔన్సు ధర 4 వేల డాలర్ల దిశగా పయనిస్తోంది. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగా పసిడి ధర సరికొత్త రికార్డులను తిరగరాస్తోంది.

అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర సోమవారానికి 3935 డాలర్లకు చేరింది. డాలర్ విలువ రూ. 88.79 కావడంతో దీని ధర ఎక్కువగా ఉంది. ఈ ధరలను అనుసరించి హైదరాబాద్‌లో 24 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ. 1,23,420కి చేరుకుంది. 22 క్యారెట్ల నాణ్యమైన 10 గ్రాముల బంగారం ధర రూ. 1,10,700 పలుకుతోంది. అటు కిలో వెండి ధర కూడా రూ. లక్షన్నర దాటింది. హైదరాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో వెండి సుమారు రూ. 1.54 లక్షలుగా ఉందని బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. బంగారం ధర ఈ స్థాయిలో పెరుగుతుండడంతో సామాన్యులు బంగారం కొనేందుకు వెనకాడుతున్నారు. దీంతో క్రయవిక్రయాలు చాలా వరకు తగ్గాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయంగా ఇతర ఆభరణాల వైపు మగువలు మొగ్గుచూపుతున్నారని చెబుతున్నారు.

పసిడి ధర తాజా దూకుడుకు అమెరికా షట్‌డౌన్ ఆజ్యం పోసింది. అమెరికన్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి డేటా ఏదీ అందుబాటులో లేకుండా పోయింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన మానిటరీ పాలసీ నిర్ణయాలకు కూడా ఈ డేటానే కీలకం. ఇంకా ఎన్నాళ్లీ అనిశ్చితి కొనసాగుతుందనే దానిపై స్పష్టత లేకపోవడంతో పుత్తడికి తాజాగా మరింత డిమాండ్ పెరుగుతోంది. ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందదన్న అంచనాలు, డాలర్ ఇండెక్స్ క్షీణించడం, అమెరికా బాండ్ల రాబడి పడిపోవడం వంటివి ఇప్పటికే బంగారానికి డిమాండ్ పెంచాయి. మరోవైపు భౌగోళిక అనిశ్చిత పరిస్థితుల కారణంగా డాలర్‌కు బదులు కేంద్ర బ్యాంకులు పసిడి నిల్వలను పెంచుకుంటూ ఉండడం మరో కారణమని అనలిస్టులు చెబుతున్నారు. బంగారం ధర పెరుగుదల నేపథ్యంలో దీని ధర గురించి ఆరా తీసేవారూ పెరిగారు. దీంతో గూగుల్ ట్రెండ్స్‌లోకి వచ్చింది.

# విద్యార్ధుల కలలకు రెక్కలు తొడుగుదాం

(మొదటి పేజీ తరువాయి)




వర్తింప చేయాలని సూచించారు. ఇందులో 4 శాతం వడ్డీకే బ్యాంకు రుణాలు ఇవ్వడంతో పాటు, దానికి ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుందని సీఎం చెప్పారు. 14 ఏళ్లలో రుణాన్ని చెల్లించుకునే వెసులుబాటు ఇస్తామని అన్నారు. మరోవైపు బీసీ విద్యార్ధులు ఐఐటీ, నీట్‌లో కోచింగ్ కోసం రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టంచేశారు. సోమవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ సంక్షేమంపై మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, ఫరూఖ్, సవిత, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

**అందరికీ నాణ్యమైన విద్య అందాలి :** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అన్ని హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చేందుకు అధ్యయనం చేయాలని, దీనిపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతీ పేద విద్యార్ధికి నాణ్యమైన విద్య అందించాలనేది తన సంకల్పమని, అధికారులు ఇందుకోసం కృషి చేయాలని సీఎం చెప్పారు. హాస్టళ్లను రెసిడెన్షియల్ పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్ధులకు నాణ్యమైన విద్య అందించడం సాధ్యమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనతో పాటు ఏడాదిలోగా మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. గురుకులాల్లో హైజీన్ పరిస్థితులు ఉండేలా చూడాలని, విద్యార్ధుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్దేశించారు. నసనకోట, ఆత్మకూరు బీసీ బాలికల పాఠశాలను రూ. 2.65 కోట్లతో జూనియర్ కాలేజీగా ఉన్నతీకరించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. అలాగే తల్లికి వందనం పథకం నుంచి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్, టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌కు నిధులు ఇస్తామని వెల్లడించారు. అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లు, హాస్టళ్లలో సౌర విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్ధులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ. 1,700 కోట్లు కాలేజీలకు చెల్లించకపోవడంతో విద్యార్ధులే రూ. 900 కోట్లు చెల్లించారని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఇంకా యాజమాన్యాలకు సుమారు రూ. 800 కోట్ల బకాయిలు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం చెల్లించాల్సి ఉందని వివరించారు.

**అన్నివర్గాలు బలోపేతం కావాలి :** సంక్షేమ శాఖలు 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్' విధానాన్ని అమలు చేసే బాధ్యత తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ లక్ష్యం నెరవేరితే ఆయా వర్గాలు ఆర్ధికంగా బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఇమామ్‌లు, పాస్టర్లకు బకాయిలు ఏమైనా ఉంటే వెంటనే విడుదల చేయాలని... అలాగే హజ్ యాత్రకు దరఖాస్తుల గడువును పెంచేందుకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు.

ఉమ్మడి రాష్ట్రంలో వక్ఫ్ ప్రాపర్టీ ఆడిట్ జరిగింది... అయితే ప్రస్తుతం వాటి ఆస్తుల స్థితిగతులు తెసుకునేందుకు మదింపు జరగాలన్నారు. ఆదరణ-3 కింద ఇచ్చే పనిముట్లు ఆధునికంగా, ఆయా కుల వృత్తులకు ఉపయోగకరంగా ఉండాలని సీఎం అన్నారు. రజకులకు గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెలు, సబ్సిడీ సిలిండర్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వెనుకబడిన వర్గాల ఆదాయార్జనకు కొత్త మార్గాలను అన్వేషించాలని సీఎం అన్నారు. మత్స్యకార వర్గాలు సీవీడ్ లాంటి నూతన ప్రత్యామ్నాయాలను ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాలని, ప్రభుత్వం ఈ వర్గాలపై పెద్దఎత్తున వ్యయం చేస్తున్నా ఫలితాలు ఆశించిన స్థాయిలో రావడం లేదన్నారు. కులవృత్తుల్లో ఆధునీకరణతోనే ఆయా వర్గాలు ఎక్కువ ఆదాయాన్ని పొందగలవని చెప్పారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా... అందరికీ సంక్షేమ ఫలాలు దక్కేలా... అధికార యంత్రాంగం చూడాలని, సంతృప్తి పరచాలని సీఎం సూచించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి న్యాయ పరమైన ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పురోగతిలో ఉన్న నెల్లూరు, ఏలూరు, కర్నూలు బీసీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 64 కులాల కార్పొరేషన్లలో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాల్ని అధ్యయనం చేసేందుకు అన్ని వర్క్‌షాపు నిర్వహించాలని సూచించారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివే విద్యార్ధుల్లో ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన వారిలో కొందరు విద్యార్ధులు సమీక్షా సమావేశానికి ముందు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం చంద్రబాబు.. ఉన్నత విద్యలో మరింత రాణించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# ఆందోళన అక్కర్లేదు

(మొదటి పేజీ తరువాయి)

కల్తీ దగ్గు మందు జాడ రాష్ట్రంలో లేనందున ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ సూచనలు అనుసరించి, రెండేళ్లలోపు ఉన్న చిన్నారులకు దగ్గు, జలుబుకు సంబంధించి ద్రవరూపంలో వైద్యులు మందులు సూచించొద్దని ఆదేశాలు పంపాలని అధికారులకు తెలిపారు.

**మందుల నాణ్యతపై నిరంతర నిఘా :** "ఔషధ దుకాణాల వారికి సదరు కంపెనీ దగ్గు మందు సరఫరా జరిగినట్లు ఆనవాళ్లు డ్రగ్ ఇన్స్పెక్టర్ల తనిఖీల్లో కనిపించలేదు. సదరు కంపెనీ నుంచి దగ్గు మందు పంపిణీ జరిగినట్లు దుకాణాల వారి వద్ద ఇన్వాయిస్ లు కనిపించలేదు. దగ్గు మందు బాక్సులు దుకాణాల్లో కనిపించలేదు. డ్రగ్ ఇన్స్పెక్టర్ల ద్వారా తనిఖీల పరంపర ఇంకా జరుగుతూనే ఉంది. ఔషధ నియంత్రణ పరిపాలనా డైరెక్టర్ జనరల్ ప్రధాన కార్యాలయంలోని అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షిస్తోంది" అని ఇంచార్జి డైరెక్టర్ జనరల్ (డిసి ఎ) గిరీషా ఆ నివేదికలో పేర్కొన్నారు.

**సింగిల్ మాలిక్యూల్ సిరప్ మాత్రమే సరఫరా :** "ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేసేందుకు కొనుగోలుచేసే మందుల్లో సదరు కంపెనీ కల్తీ మందు లేదు. రాష్ట్రంలో 4 రకాల కంపెనీల దగ్గుమందులు వాడుతున్నాం. కాంబినేషన్ ఫార్ములేషన్ కాకుండా సింగిల్ మాలిక్యూల్ సిరప్ మా సంస్థ ప్రభుత్వాసుపత్రులకు పంపిణీ చేస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాలలో కాంచీపురంకి చెందిన కంపెనీ (శ్రీశాన్ ఫార్మస్యూటికల్స్) నుంచి 'కోల్డిఫ్' దగ్గు మందు కాంబినేషన్ రూపంలో సరఫరా జరిగింది. ఈ క్రమంలో డైఇథిలిన్ గ్లైకాల్ నిర్దిష్ట ప్రమాణాల కంటే అధిక మోతాదులో వాడిన కల్తీమందు ఆ రాష్ట్రాల్లో సరఫరా జరిగింది" అని రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీ గిరిషా నివేదికలో వివరించారు.

**జిల్లా అధికారులకు ఆదేశాలు :** "భారత డైరెక్టర్ జనరల్ హెల్త్ సర్వీసెస్ ఆదేశాలను పంపించి, వైద్యులు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించాం. వీటి అమలు క్షేత్రస్థాయిలో ఎలా ఉందో నివేదించాలని పేర్కొన్నాం. ఫార్మసిస్టులకు కూడా అవగాహన కల్పించాలని సూచించినట్లు" రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ మంత్రికి పంపిన నివేదికలో పేర్కొన్నారు.

# పుష్కరాలకు ముందే పోలవరం పూర్తి

(మొదటి పేజీ తరువాయి)



పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర జల శక్తి మంత్రి పాటిల్ హామీ ఇచ్చినట్లు రామానాయుడు స్పష్టం చేశారు. ఇందుకు ఆయనకు, గౌరవ ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కార్ ఉండటం వల్ల పోలవరం పూర్తి కావడం, పోలవరం నీటితో రాష్ట్రం సస్యశ్యామలం కావడం ఖాయమన్నారు.

2019లో తెలుగుదేశం ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 లోనే పోలవరం పూర్తయ్యేదని మంత్రి రామానాయుడు చెప్పారు. 72% పూర్తయిన పోలవరం ప్రాజెక్టు ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల, రివర్స్ పాలన తో నీరుగార్చడం వల్ల ప్రాజెక్టుకు అపార నష్టం జరిగిందని మంత్రి ఆవేదన చెందారు. ప్రాజెక్ట్ కు జరిగిన నష్టం తో పాటు ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్నదాతలకు రావలసిన 50 వేల కోట్ల ఆదాయం నష్టపోయినట్లు మంత్రి అంచనా వేశారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే 23.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణ జరుగుతుందన్నారు. 28.5 లక్షలు మందికి తాగునీరు అందుతుందన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. పోలవరంతో రాష్ట్రం దశ దిశ మారిపోవడం ఖాయమన్నారు. ఈ ఆశయంతోనే గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయం పర్యవేక్షణలో ప్రతి 15 రోజులకు సమీక్ష చేస్తూ పనులను పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ 1398 మీటర్లకు గాను ఇప్పటికి 686 మీటర్లు అంటే 56% పూర్తయినట్లు చెప్పారు. ప్రస్తుత వర్షాకాలంలో రోజుకి 5 లక్షలు పైగా క్యూసెక్కులు వరద నీరు ప్రవహిస్తున్నా పనులు ఆపలేదన్నారు. అదే జగన్ ఐదేళ్ల హయాంలో ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య వరద నీరు రిజర్వాయర్ ను తలపించే దన్నారు. ఇలా జరగకుండా బట్రస్ డ్యామ్ నిర్మించి సిపేజీని అరికట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టుకి నాటి జగన్ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని, దశల వారి జరిగిన విధ్వంసాన్ని మంత్రి కళ్ళకు కట్టినట్లు వివరించారు. వారి బాధ్యతా రాహిత్యాన్ని ఎండగట్టారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం 2014-19 మధ్యకాలంలో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఖర్చు పెట్టిన 3750 కోట్లు, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియంబర్స్మెంట్ గా వస్తే ఆ నిధులను దారి మళ్లించేసినట్లు రామానాయుడు వివరించారు.

**ప్రాజెక్టుకి నిధుల సమస్య లేదు :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టుకి రూ. 12157 కోట్లు కేంద్రం మంజూరు చేయగా ఇప్పటికే 5052 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. చేసిన పనులు తాలూకు వివరాలు ఎప్పటికప్పుడు కేంద్రానికి సమర్పిస్తే, దశల వారీగా నిధులు కేంద్రం మంజూరు చేస్తుందని.. అందువల్ల నిధుల సమస్య లేనే లేదని మంత్రి స్పష్టం చేశారు.

పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్ -1కి సంబంధించి (అంటే 41.15 మీటర్ల ఎత్తుకు నీటిని నిలబెట్టే వరకు ) నిర్వాసితులు ఎవరైతే ఉన్నారో వారందరికీ నష్టపరిహారం, కాలనీల నిర్మాణం, వసతులు సమకూర్చడం వంటి అన్ని పనులు 2026 మే నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి చెప్పారు. మొదటి ఫేజ్ లో 20946 మంది నిర్వాసితులు ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ 75 కాలనీలు నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 26 పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన 49 ప్రోగ్రెస్ లో ఉన్నాయన్నారు. బ్యాలెన్స్ పనులకు, ఇతర సదుపాయాలు సమకూర్చడానికి రూ. 900 కోట్లు కేటాయించి టెండర్లు పిలిచామన్నారు. ఫేజ్- 2 కి సంబంధించి నిర్వాసితులకు 2027 మార్చి కల్లా కాలనీలు నిర్మించి, సదుపాయాలు సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రామానాయుడు చెప్పారు. పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని చేతులెత్తేసిన నాటి ముఖ్యమంత్రి జగన్ కి, గడువు చెప్పి.. ప్రారంభానికి పనులు పరుగులు పెట్టిస్తున్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దక్షతకు తేడా గమనించాలని రామానాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మొదటి ఫేజ్ లో 41.15 మీటర్లు కాంటూరు కి సంబంధించి 38వేల 060 కుటుంబాలను గుర్తించామన్నారు. ఇందులో మొదటి విడతలో 20,946, తరువాత రాడార్ సర్వే ద్వారా మరో 17,174 కుటుంబాలకు 75 కాలనీలు అవసరమైతే, నాడు చంద్రబాబు గారి హయాంలోనే 26 కాలనీలు పూర్తి చేశాం. 49 కాలనీలో పురోగతిలో ఉన్నాయని వివరించారు

2019-24 జగన్ పరిపాలనా కాలంలో ఒక్కకాలనీలో ఒక్క నిర్వాసితుడి ఇంటికి, అరబస్తా సిమెంట్ గానీ, మౌళిక వసతుల కోసం ఒక్క రూపాయి గానీ ఖర్చు పెట్టలేదని విమర్శించారు. నాడు చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మించిన కాలనీలు తప్ప, ఒక్క నిర్వాసితుడి ఇంటిని కూడా పూర్తి చేయలేదని అన్నారు.

## ఆర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో అందిన ఆర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రతీ ఆర్జీ పరిశీలించాల్సించి స్పష్టమైన పరిష్కారం చూపాలని అన్నారు. పి.జి.ఆర్.ఎస్ లో ప్రజలు తమ సమస్యలు పరిష్కారం దిశగా వ్యయ ప్రయాసలకు గురై వస్తారని వాటికి మంచి పరిష్కారం చూపినప్పుడే సంతృప్తి కలుగుతుందని చెప్పారు. క్షేత్ర స్థాయిలోకి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతీ ఆర్జీని నిర్దేశిత సమయంలో పరిష్కరించాల్సిందే అన్నారు. ఆర్జీలో వివరాలు ముందుగా అవగాహన చేసుకోవాలని, అర్జీ ప్రభుత్వ విధానాలకు సంబంధించిందా లేదా ఇతర అంశాలకు సంబంధించిందా చూడాలని ఆదేశించారు. ఆర్జీలకు సంబంధించి స్పష్టమైన, వాస్తవ వివరాలు మాత్రమే ఇవ్వాలని చెప్పారు.

ప్రీ ఆడిట్ సక్రమంగా చేయాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 220 అర్జీలు అందాయి.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, పి.జి.ఆర్.ఎస్ నోడల్ అధికారి గంగారాజు, డిప్యూటీ కలెక్టర్ విజయ లక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కళ్యాణ చక్రవర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వర రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



(మొదటి పేజీ తరువాయి)

సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్ గా మందలపు రవికుమార్ ఎంపికను సమర్థిస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీలకు వినియోగిస్తూ, అదే విధంగా సామాన్య ప్రజలకు చేరవేసి తద్వారా శాఖల అభివృద్ధిలో, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలలో భాగస్వామ్యులు కావాలని మందలపు రవికుమార్ కు సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ దార్శనిక సీఎం చంద్రబాబునాయుడుకు అత్యంత ఇష్టమైన సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ గా మందలపు రవికుమార్ ను నియమించడం సంతోషంగా ఉందన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ తదితర అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఒడిసిపట్టుకున్న మొట్టమొదటి వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. అలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చేందుకు విద్యావంతుడైన రవిని సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ గా నియమించడం ముదావహమన్నారు. పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలకు సైన్స్ అండ్ టెక్నాలజీ కూడా జోడైతే మరిన్ని విప్లవాత్మక కార్యక్రమాలు తీసుకురాగలమని మంత్రి దుర్గేష్ అభిప్రాయపడ్డారు. ఈ సదవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని రవికి సూచించారు. సైన్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ గా మందలపు రవి ప్రత్యేక పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నారన్నారు.

కూటమి సమన్వయ కమిటీ సమావేశాల్లో పరిచయమైన ఎన్ఆర్ఐ మందలపు రవికుమార్ సమన్వయకర్తగా అద్భుతంగా పనిచేశారని మంత్రి దుర్గేష్ కొనియాడారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా నాడు చంద్రబాబునాయుడును జైల్లో పెట్టిన సందర్భంలో జనసేనాని పవన్ కళ్యాణ్ చూపించిన చొరవను అదే సందర్భంలో రాజమండ్రిలో నెలకొన్న పరిస్థితులను మంత్రి దుర్గేష్ గుర్తుచేస్తూ నాడు ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్తగా మందలపు రవికుమార్ వ్యవహరించిన తీరును కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఎన్ఆర్ఐల పాత్ర ప్రశంసనీయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ మందలపు రవి కుమార్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు కల్పించిన అవకాశంతో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమన్వయకర్తగా పనిచేశానన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్ గా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ (చంటి), గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, భవన నిర్మాణ, కార్మిక సంఘం అధ్యక్షులు, తాడేపల్లిగూడెం టీడీపీ ఇంచార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి), ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు, పశ్చిమగోదావరి మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ ముళ్లపూడి బాపిరాజు, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ కోమటి జయరామ్, నాగరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

10o మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-A కార్యాలయ స్థలంతో మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్‌ను అభివృద్ధి చేయండి.

రహేజా గ్రూప్-ప్రిన్స్ టన్ డిజిటల్ గ్రూప్ భాగస్వామ్యాన్ని ఉపయోగించి దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ హబ్‌ను (హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్) ఏర్పాటు చేయండి. ఆంధ్రప్రదేశ్ పునరుత్పత్తి శక్తి సమృద్ధిగా ఉండటం, తీర ప్రాంత కనెక్టివిటీ (సబ్‌మరైన్ కేబుల్స్ కోసం), రాయితీతో పరిశ్రమలకు అవసరమైన భూమి లభ్యత వంటి ప్రత్యేక ప్రయోజనాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తోంది. అమరావతి రాజధానికి సేవలందించే విధంగా 5 స్టార్ బిజినెస్ హొటల్ (వెస్టిన్/JW మారియట్)ను అమరావతిలో ఏర్పాటుచేయండి. విశాఖపట్నంలో వ్యాపార, వినోద విభాగాలను లక్ష్యంగా బీచ్ రిసార్ట్ ప్రాపర్టీ రిటైల్ & మాల్ నెట్‌వర్క్ ఏర్పాటుపై దృష్టిసారించండి. ప్రస్తుతం విశాఖలో నిర్మాణంలో ఉన్న ఇనార్బిట్ మాల్ ను త్వరగా పూర్తిచేసి, విజయవాడ, అమరావతిలో అదే తరహా మాల్స్ అభివృద్ధి చేయండి. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏపీలోని 8-10 నగరాల్లో షాపర్స్ స్టాప్ రిటైల్ స్టోర్లను విస్తరించండి. అమరావతి రాజధాని ప్రాంతంలో ప్రీమియం అపార్ట్‌మెంట్ ప్రాజెక్టులను ("రహేజా హొమ్స్") ప్రారంభించాలని మంత్రి లోకేష్ కోరారు.


# అన్న క్యాంటీన్లలో నాణ్యత గల ఆహారం ఇవ్వాలి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్నక్యాంటీన్లలో ఆహార సరఫరా సమయాలల్లో పర్యవేక్షణ కోసం విధులు కేటాయించిన వార్డ్ సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షణ చేసి, ఏమైనా లోపాలు గుర్తిస్తే నివేదిక ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్ లోని అన్న క్యాంటీన్ ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్లలో ప్రతి రోజు ప్రభుత్వ నిర్దేశిత సమయంలో ఆహారం అందుబాటులో ఉండేలా, మౌలిక వసతులు కల్పించేలా పర్యవేక్షణ కోసం వార్డ్ సచివాలయ కార్యదర్శులను కేటాయించామని, వారు నిర్దేశిత సమయంలో క్యాంటీన్లో ఉండాలన్నారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రంకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రధానంగా త్రాగునీరు, పారిశుధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్



స్టాకహోం : రోగ నిరోధక వ్యవస్థకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలకు ఈ ఏడాది వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి ముగ్గురిని వరించింది. జపాన్‌కు చెందిన షిమోన్ సకాగుచి, అమెరికాకు చెందిన మేరీ ఇ.బ్రుంకొవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్‌లు ఈ బహుమతిని పంచుకోనున్నారు. రోగ నిరోధక వ్యవస్థలో సెక్యూరిటీ గార్డులుగా పిలిచే రెగ్యులేటరీ టి కణాలను వీరు గుర్తించారు. రోగ నిరోధక కణాలు మన శరీరంపైనే దాడి చేయకుండా ఈ టి కణాలు అడ్డుకుంటాయని వారు గుర్తించారు. రోగ నిరోధక వ్యవస్థ ఎలా పని చేస్తుంది, మనందరిలోనూ తీవ్రమైన ఆటో ఇమ్యూన్ వ్యాధులు ఎందుకు వృద్ధి చెందవో అర్థం చేసుకోవడానికి ఈ ఆవిష్కరణలు బాగా ఉపయోగపడతాయని నోబెల్ కమిటీ ఛైర్మన్ ఓలె కాంపె వ్యాఖ్యానించారు. ఆటో ఇమ్యూన్ వ్యాధులు, కేన్సర్లకు కొత్త చికిత్సలను అభివృద్ధిపరచడానికి ఈ ఆవిష్కరణలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఆటో ఇమ్యూన్ వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించే రోగ నిరోధక కణాలను షిమోన్ సకగుచి తొలుత 1995లో కనుగొన్నారు. ఆ తర్వాత 2011లో ఆ కణాలు పనిచేయడానికి కీలకమైన జన్యువును అమెరికన్ పరిశోధకులు మేరీ, ఫ్రెడ్ కనుగొన్నారు. రెండేళ్ల తర్వాత సకగుచి ఈ ఆవిష్కరణలన్నింటినీ అనుసంధానిస్తూ తాను గుర్తించిన ఈ టి కణాల అభివృద్ధికి ఫాక్స్ పి3 జన్యువు కారణమవుతోందని రుజువు చేశారు. ముందుగా వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతిని ప్రకటించడంతో ఇక వరుసగా ఈ వారమంతా వివిధ విభాగాల్లో నోబెల్ బహుమతులు ప్రకటిస్తారు. చివరిగా నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడుతుంది. వీరందరికీ డిసెంబరు 10న బహుమతి ప్రదానం వుంటుంది.

# జగన్ హయాంలో కల్తీ మద్యంతో ప్రాణాలు తీశారు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం ఏరులై పారిందని, దాని కారణంగా ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపణలు చేశారు. ప్రజల ఆరోగ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు లేదని ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం వల్ల జరిగిన మరణాలను ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు.

మన్యం జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులు అస్వస్థతకు గురై విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. సోమవారం హోంమంత్రి అనిత వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

విద్యార్థుల అస్వస్థత ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని, వైద్య నిపుణులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశించామని అనిత తెలిపారు. పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. నిన్న మంత్రి సంధ్యారాణి కూడా విద్యార్థులను పరామర్శించారని ఆమె పేర్కొన్నారు.

గత జగన్ ప్రభుత్వంలో ఇద్దరు గిరిజనులకు డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చినా, వారు ఒక్కసారి కూడా ఆశ్రమ పాఠశాలల వైపు కన్నెత్తి చూడలేదని అనిత విమర్శించారు. కానీ ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వంలో మంత్రులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని ఆమె వివరించారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు.

# మల్లికార్జున ఖర్గేను పరామర్శించిన రేవంత్ రెడ్డి

**తెలంగాణ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరామర్శించారు. ఖర్గే అస్వస్థతకు గురికావడంతో ఆసుపత్రిలో చేరారు. బెంగళూరులోని ప్రఖ్యాత ఎం.ఎస్. రామయ్య ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందిన అనంతరం ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఖర్గే శ్వాస సంబంధిత సమస్యలు, జ్వరంతో బాధపడుతున్న కారణంగా, ఆయన గుండె వేగం తగ్గకుండా ఉండేందుకు వైద్యులు పేస్ మేకర్ ఇంప్లాంట్ ప్రక్రియ నిర్వహించారు.

ఈ నేపథ్యంలో మల్లికార్జున ఖర్గేను పరామర్శించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెంగళూరుకు చేరుకున్నారు. పరామర్శ అనంతరం, వారి మధ్య రాజకీయ అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, సుప్రీంకోర్టులో విచారణకు సంబంధించిన అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం.

# ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం పొడిగింపు..!

- **తాజా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం**
- **గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలకు చెక్**
- **రైతులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వ ఆలోచన**
- **త్వరలో నెరవేరునున్న రైతుల కల**



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై మరి కొంతకాలం నిషేధం కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. తాజా సమాచారం ప్రకారం నవంబర్ 11 వం-కు ఈ నిషేధాన్ని ప్రభుత్వం పొడిగించింది.. ఈ భూముల వ్యవహారంలో గత ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాల వల్ల అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. దీనిని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయించింది. అర్హులైన రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఇప్పటికే ఆదేశించారు. అయితే దీనిపై, రెవెన్యూ శాఖ ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరలో దీనిపై ఒక పరిష్కారం వస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి జయలక్ష్మి ఫ్రీ హోల్డ్ భూములపై నిషేధాన్ని మరో రెండు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. గత 15 నెలలుగా ప్రభుత్వం దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అర్హులైన వారికి వెంటనే న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. కానీ రెవెన్యూ శాఖ మాత్రం ఈ సమస్యను పరిష్కరించలేదు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల చాలా అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటి రిజిస్ట్రేషన్లపై నిషేధం విధించింది. ఆ తప్పులను సరిదిద్దుతామని ప్రభుత్వం తెలిపింది.. కానీ ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ముఖ్యమంత్రి చంద్రబాబు జులై 5న ఫ్రీ హోల్డ్ భూముల సమస్యలపై రెవెన్యూ శాఖతో చర్చించారు. ఒకవేళ ఫ్రీ హోల్డ్‌కు అర్హులైన వారు ఏ పార్టీ వారైనా సరే న్యాయం జరగాలని ఆయన స్పష్టం చేశారు. అర్హత ఉన్న అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలని ఆయన అన్నారు. 20 ఏళ్ల గడువు దాటిన భూములను ఫ్రీ హోల్డ్ చేయాలన్నారు. రెవెన్యూ శాఖ మాత్రం ఈ విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు.. దీంతో స్థానిక నాయకులు తక్కువ ధరలకే భూములు కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా చిన్న రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ప్రభుత్వం త్వరగా స్పందించి అర్హులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో ప్రభుత్వం త్వరగా ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే బావుంటుంది అంటున్నారు. అర్హత ఉన్న అసైన్డ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోవాలని.. ఆలస్యం చేయవద్దని కూడా చంద్రబాబు ఆదేశించారు. అసైన్డ్ భూమి పొజిషన్లో ఉండి, సరైన రికార్డులు కలిగి ఉంటే, 20 ఏళ్ల గడువు దాటిన వాటిని రాజకీయాలతో సంబంధం లేకుండా ఫ్రీ హోల్డ్ చేయాలన్నారు. 'అసైన్‌మెంట్ రికార్డులు లేని భూములు, కలెక్టర్ ఉత్తర్వులు లేనివి, జీవో 596కి విరుద్ధంగా ఉన్నవి, ఎక్కువ విస్తీర్ణం క్లెయిమ్ చేసేవి, ఇతరులు క్లెయిమ్ చేసే భూములు, అభ్యంతరాలున్న పోరంబోకు భూములు, నీటి వనరులున్న పోరంబోకు భూములు, 20 ఏళ్ల గడువు దాటని అసైన్డ్ భూములకు ఫ్రీ హోల్డ్ వద్దు' అని కూడా చెప్పారు. దాదాపు 7 లక్షల ఎకరాల భూమి అర్హత కలిగి ఉందని గుర్తించగా.. కనీసం వాటినైనా నిషేధం నుండి తొలగించాలని కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంపై అక్రమాలు జరిగాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. 2024 మే నాటికి 13 లక్షల ఎకరాల భూమి ఫ్రీ హోల్డ్ అయినట్లు గుర్తించారు. ఇందులో 7 లక్షల ఎకరాలు సక్రమంగా జరిగాయని.. 5 లక్షల ఎకరాల్లో అక్రమాలు జరిగాయని రెవెన్యూ శాఖ తెలిపింది. ఈ అక్రమాలపై విచారణ జరుగుతోంది. మంత్రివర్గ ఉపసంఘం అక్టోబరులో నివేదిక ఇస్తామని చెప్పింది. దీంతో దసరా నాటికి నిషేధం ఎత్తివేస్తారని భావించారు. కానీ తాజాగా నిషేధాన్ని మరో రెండు నెలలు పొడిగించారు. దసరా కాదు, ఒక ప్రక్క దీపావళి పూర్తయ్యాక కూడా ఈ సమస్య పరిష్కారం అయ్యే పరిస్థితులు కనిపించడం లేదంటున్నారు.

# సిజెఐపై దాడి



**న్యూఢిల్లీ :** మతోన్మాదులు బరితెగించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సాక్షాత్తూ భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్ గవాయ్ పైనే ఓ మతోన్మాది షూ విసిరాడు. సోమవారం ఉదయం ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. సిజెఐ బిఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనంలో కేసు విచారణ సమయంలో డయాస్ వద్దకు వెళ్లిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా తన స్పోర్ట్స్ షూ తీసి, సిజెఐపైకి విసిరాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది లాయర్‌ని అడ్డుకుని బయటకి లాక్కెళ్లారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. 'సనాతనానికి జరిగే అగౌరవాన్ని భారతదేశం సహించదు' అంటూ నిందితుడు గట్టిగా కేకలు వేశాడు. ఈ ఘటనతో కోర్టులో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.

**ఇలాంటి బెదిరింపులు ప్రభావితం చేయలేవు : సిజెఐ** ఇలాంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయలేవని సిజెఐ గవోరు స్పష్టం చేశారు. ఘటన జరిగిన వెంటనే స్పందించిన సిజెఐ.. మిగతా లాయర్లు తమ వాదనలు కొనసాగించాలని ఆదేశం చారు. ఇలాంటి వాటి పట్ల ఎవరూ ప్రభావితం కావొద్దని, తామేమీ చలించడం లేదని, ఇలాంటి ఘటనలు తనను ప్రభావితం చేయలేవని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో పోలీసులు సమన్వయం చేసుకుని ఈ విషయంపై తదుపరి దర్యాప్తు జరుపుతున్నారని ఆయా వర్గాలు తెలిపాయి.

**ఖండించిన న్యాయవాద సంఘాలు, పార్టీలు :** ఈ ఘటనను న్యాయవాద సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రముఖులు ఖండించారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ (ఐలు), సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్‌సిఎఒఆర్‌ఎ) తదితర సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనను సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

**విద్వేషానికి ప్రతిబింబం : పినరయి విజయన్ :** సంఘ్ పరివార్ వ్యాప్తిచేసిన విద్వేషానికి ప్రతిబింభమే ఈ భయంకరమైన సంఘటన అని కేరళ సిఎం పినరయి విజయన్ విమర్శించారు. సిజెఐకి సంఘీభావంగా నిలవాలని పిలుపునిచ్చారు.

**రాజ్యాంగంపై దాడి : కాంగ్రెస్ :** సిజెఐపై దాడిని ఖండించడానికి మాటలు సరిపోవని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. ఆయనపైనే కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడి అని, తీవ్రమైన ఆగ్రహం, బాధతో గవారుకు సంఘీభావంగా దేశమంతా నిలవాలని కోరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ ఈ బుద్ధిహీన చర్య సమాజాన్ని ద్వేషం, మతోన్మాదం ఎలా ముంచెత్తాయో చూపిస్తుందని విమర్శించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తదితరులు సిజెఐపై దాడిని తీవ్రంగా ఖండించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ చర్య దురదృష్టకరమని, ఖండించదగినదని అన్నారు. సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ ఈ ఘటనను న్యాయవ్యవస్థపై దాడిగా పేర్కొన్నారు.

**స్వతంత్ర న్యాయవ్యవస్థపై బహిరంగ దాడి : ఐలు :** ఈ ఘటన సుప్రీంకోర్టు, సాధారణంగా స్వతంత్ర న్యాయవ్యవస్థపై జరిగిన బహిరంగ దాడిగా ఐలు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బికాస్ రంజన్ భట్టాచార్య, పివి సురేంద్రనాథ్ పేర్కొన్నారు. దీనిని వికృత మనస్తత్వం కలిగిన వ్యక్తి చేసిన చర్యగా పరిగణించలేమని, దేశంలో న్యాయ వ్యవస్థ, దాని స్వతంత్రత, న్యాయ సమీక్ష శక్తి, లౌకికవాద భావనపై కొన్ని వర్గాల నుండి వ్యవస్థీకృతమైన, దుర్మార్గపు దుర్భాషలతో ప్రచారంలో భాగంగా దీనిని చూడాలని అన్నారు. ఇది దేశ మనస్సాక్షిని దిగ్భ్రాంతికి గురిచేస్తుందని, దేశంలో "నాథురామ్ మనసు" పథాన్ని గుర్తు చేస్తుందని విమర్శించారు. దీనిని సహించలేమని, సమాజంలోని అన్ని వర్గాలు, ముఖ్యంగా న్యాయ సోదరభావం తీవ్రంగా ఖండించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇది న్యాయ వ్యవస్థపైనే కాకుండా రాజ్యాంగంపై కూడా జరిగిన దాడి అని పేర్కొన్నారు. ఈ ఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని, నిందితుడు, తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఖండిస్తూ నిరసనలు తెలపాలని పిలుపు ఇచ్చారు.

**న్యాయవాదిని సస్పెండ్ చేసిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా :** నిందితుడు కిషోర్ రాకేష్‌ను తక్షణమే సస్పెండ్ చేసినట్లు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) ప్రకటించినట్లు లైవ్ లా నివేదించింది. విచారణ కొనసాగుతున్న సమయంలో న్యాయవాది రాకేష్ కిషోర్ చర్య కోర్టు గౌరవానికి విరుద్ధంగా ఉందని, ఆయన అడ్వకేట్స్ చట్టం-1961, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం వృత్తిపరమైన ప్రవర్తనా నియమాలను స్పష్టంగా ఉల్లంఘించారని బిసిఐ చైర్‌పర్సన్, సీనియర్ న్యాయవాది కుమార్ మిశ్రా చెప్పారు. సస్పెన్షన్ కాలంలో దేశంలోని ఏ కోర్టు, ట్రిబ్యునల్, అథారిటీలో వాదించేందుకు, ప్రాక్టీస్ చేయడంపై నిషేధం విధించినట్లు తెలిపారు.

**విద్వేష ప్రచారమే కారణం? :** ఖజురహోలోని ఏడు అడుగుల విష్ణు విగ్రహాన్ని పునర్ ప్రతిష్టించాలని దాఖలు చేసిన పిల్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. అదో ఆర్కియాలజీ సైట్ అని, దానికి ఎఎస్ఐ పర్మిషన్ అవసరం ఉంటుందని ఆ కేసులో సిజెఐ వ్యాఖ్యానించారు. దీనిపై ఇంకా వాదనలు కొనసాగిస్తుండగా, విష్ణువుకు భక్తుడినని చెబుతున్నారు కదా! ఆయననే ప్రార్థించండని సిజెఐ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై విషం చిమ్ముతూ మతోన్మాదులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. రెండు రోజుల తరువాత ఓ కేసులో సిజెఐ స్పందిస్తూ తానే మతాన్ని అమర్యాదపరచలేదన్నారు. అన్ని మతాలను గౌరవిస్తానని, కేవలం సోషల్ మీడియాలోనే తన వ్యాఖ్యలు ప్రచారం అయినట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ%" %సోషల్ మీడియాల్లో కొన్ని సందర్భాల్లో ప్రతిచర్యలు భిన్నంగా ఉంటాయని అన్నారు.

# సీజేఐపై బూటుతో దాడికి యత్నం... ప్రధాని మోదీ స్పందన



**న్యూఢిల్లీ :** దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సోమవారం తీవ్ర కలకలం రేగింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ పైకి ఓ వ్యక్తి బూటు విసిరేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనను ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన జస్టిస్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం ఉదయం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగా, న్యాయవాది దుస్తుల్లో ఉన్న ఓ వ్యక్తి అనూహ్యంగా ధర్మాసనం వైపు దూసుకొచ్చాడు. సీజేఐ జస్టిస్ గవాయ్‌పైకి తన పాదరక్షను విసిరేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అడ్డుకుని కోర్టు హాలు నుంచి బయటకు తీసుకెళ్లారు. ఆ సమయంలో ఆ వ్యక్తి 'సనాతన ధర్మం' గురించి నినాదాలు చేసినట్లు సమాచారం.

ఈ అనూహ్య ఘటనతో విచారణకు కొద్దిసేపు అంతరాయం కలిగినా, సీజేఐ జస్టిస్ గవాయ్ ఏమాత్రం చలించలేదు. "ఇలాంటి వాటివల్ల మన ఏకాగ్రత దెబ్బతినకూడదు. మేం చలించం. ఇవి నన్ను ప్రభావితం చేయలేవు" అని వ్యాఖ్యానించి విచారణను కొనసాగించారు. ఆ తర్వాత, దాడికి యత్నించిన వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని, ఆ విషయాన్ని విస్మరించాలని ఆయన సూచించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రంగా స్పందించారు. "సుప్రీంకోర్టులో సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రతి భారతీయుడినీ ఆగ్రహానికి గురిచేసింది. ఇలాంటి నీచమైన చర్యలకు మన సమాజంలో చోటు లేదు. ఇది తీవ్రంగా ఖండించదగింది" అని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ జస్టిస్ గవాయ్ ప్రదర్శించిన సంయమనాన్ని ప్రశంసించారు. ఇది న్యాయ విలువల పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తోందని అభినందించారు.

మరోవైపు, ఈ దుశ్చర్యను సుప్రీంకోర్టు అడ్వొకేట్స్-ఆన్-రికార్డ్ అసోసియేషన్ (స్కోరా) ఏకగ్రీవ తీర్మానంతో ఖండించింది. న్యాయవాద వృత్తికే అవమానకరమైన ఈ చర్య, న్యాయస్థానం గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది.

# అమరావతి,పోలవరం స్వర్ణాంధ్ర కు మూలస్థంబాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమరావతి , పోలవరం అభివృద్ధి రాష్ట్రం స్వర్ణ ఆంధ్ర ఏ 2047 లక్ష్యాన్ని సాధించడంలో ప్రధాన స్థంభాలుగా నిలుస్తున్నాయని రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. ఈ దిశగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ ఏ 2047 సంకల్పంతో సయోధ్యగా రాష్ట్రం ముందుకు సాగుతోందని తెలిపారు. సోమవారం ఎపి సచివాలయంలో రాజస్థాన్ ప్రణాళికా శాఖ అధికారులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజధాని అవసరం ఏర్పడిందని అందుకునుగుణంగా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అమరావతిని రాజధాని నగరంగా ఎంపిక చేశారని తెలిపారు. ప్రఖ్యాత అంతర్జాతీయ సంస్థ ఫోస్టర్ అండ్ పార్ట్నర్స్) రూపొందించిన 217 చ.కి.మీ. విస్తీర్ణంలో మాస్టర్ ప్లాన్ ద్వారా అమరావతి ఒక ఆధునిక, సుస్థిర, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దబడుతోందని చెప్పారు. 2031 నాటికి సుస్థిరత,సాంకేతికత,సమానత్వం వంటి అంశాలను ప్రతిబింబించే మోడల్ సిటీగా అమరావతిని అభివృద్ధి చేయడం జరుగుతోందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ దేశంలో మొదటిసారిగా ల్యాండ్ పూలింగ్ సిస్టమ్ ను అమలు చేసిందని గుర్తు చేశారు. ఈ విధానం ద్వారా రైతుల వద్ద నుండి 34,000 ఎకరాలు భూమిని సేకరించి ప్రభుత్వ ఖజానాకు భారంగా కాకుండా రాజధాని నిర్మాణం ప్రారంభించిందన్నారు. మరో 40,000 ఎకరాలు సేకరించి అంతర్జాతీయ విమానాశ్రయం,అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం,విశ్వవిద్యాలయాలు, సంస్థల ప్రాంతాలు ఏర్పాటు చేయనున్నారన్నారు. ఈ అభివృద్ధిని పర్యవేక్షించడానికి అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ( స్థాపించబడిందని దినకర్ తెలిపారు.



217 చ.కి.మీ. విస్తీర్ణంలో కృష్ణానది ఒడ్డున అభివృద్ధి రాజధాని అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్టు చైర్మన్ దినకర్ పేర్కొన్నారు. 9 విభాగాలుగా విభజన ప్రభుత్వ, న్యాయ, ఆరోగ్య, విద్య, ఆర్థిక, ఎలక్ట్రానిక్స్, క్రీడా, విద్యా పర్యాటక రంగాలు, పచ్చదనం,పునరుత్పాదక శక్తి, ఆధునిక రవాణా వ్యవస్థలపై దృష్టి,దశలవారీ అభివృద్ధి: రహదారులు, గృహ నిర్మాణం, ఉద్యోగ క్షేత్రాలు, వాణిజ్య కేంద్రాలు,స్వయం సమృద్ధి: భూమి విక్రయం , అభివృద్ధి ద్వారా ఆదాయ సృష్టికి చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. రాజధాని విస్తీర్ణం: 217 చ.కి.మీ.లు,జనాభా: 2050 నాటికి 45 లక్షలు,ఉపాధి సృష్టి: 18 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా దశలవారీగా అమలుకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. దశ %×: 2015-%2025,దశ %××: 2025-%2035(ప్రస్తుతం కీలక దశ),దశ %×××: 2035-%2050అని చెప్పారు. ప్రధాన రంగాలు:ఐటీ ఏఐ, ఫైనాన్స్, హెల్త్, జస్టిస్, నాలెడ్జ్ ఇండస్ట్రీలు, అంతర్జాతీయ సంస్థలు. "క్వాంటమ్ వ్యాలీ"గా అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు , ఆధునిక పరిశోధనలకు కేంద్రంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.

పోలవరం ఆంధ్రప్రదేశ్ జీవనాధారంగా నిర్మించడం జరుగుతోందని దానిలో భాగంగా పూర్తి నిల్వ సామర్థ్యం: 194.6 టీఎంసీ,ప్రయోజనకర నిల్వ: 175 టీఎం,రాష్ట్రంలోని 26 జిల్లాలకు సాగు మరియు తాగునీటి సరఫరాకు కృషి జరుగుతోందన్నారు. అడ్డంకి ఎత్తు: 45.72 మీటర్లు హైడ్రో పవర్ సామర్థ్యం: 960 మెగావాట్లని తెలిపారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలకునీటిసరఫరా,విశాఖపట్నానికి 23.44 టీఎంసీ నీరు,రాయలసీమకు 80 టీఎంసీ నీటి మళ్లింపు,ఎపి రీఆర్గనైజేషన్ చట్టం సెక్షన్ 90 కింద,సాగు భాగాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా భరించనుందని లంకా దినకర్ స్పష్టం చేశారు.

నదుల అనుసంధానం %-% భవిష్యత్తు నీటి భద్రత కింద రాష్ట్రానికి శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు రెండు ప్రధాన లింకులు ప్రతిపాదించబడ్డాయి:అవి గోదావరి-కృష్ణా-రాయలసీమ లింక్)బనకచర్ల (ప్రాజెక్టు)81,000 కోట్ల రూ.లు అంచనా అని వివరించారు. ఉత్తర ఆంధ్ర: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం,%×ు ఒ% ఫార్మా కారిడార్లు, పర్యాటక అభివృద్ధి, రాయలసీమ:ఓర్వకల్,కోపర్తిఇండస్ట్రియల్నోడ్స్,ప్రముఖ పారిశ్రామిక కారిడార్లు: విశాఖ%-%చెన్నై, చెన్నై%-%బెంగళూరు,హైదరాబాద్%-%బెంగళూరు,తీరప్రాంత అభివృద్ధి: కృష్ణపట్నం నుండి భావనపాడువరకుపోర్ట్బెల్ట్విజన్2047స్వర్ణఆంధ్ర,వికసిత్ భారత్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు.

రాజస్థాన్ రాష్ట్ర ప్రణిళికాశాఖ సంయుక్త కార్యదర్శి చేతన్ ప్రకాశ్ మాండవారియా మాట్లాడుతూ రెండు రోజుల స్టడీ టూర్ లో భాగంగా ఎపికి రాడవడం జరిగిందని తెలిపారు. ఈపర్యటనలో భాగంగా ఎపి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై అధ్యయనం చేయడం జరుగుతుందని అన్నారు. వికసిత్ భారత్ లో భాగంగా రాజస్థాన్ రాష్ట్రం 4.3 ట్రిలియన్ యుఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ముఖ్యంగా తాగునీటి నిర్వహణ వ్యవస్థ,ఇంధనం,సాంఘిక సంక్షేమం,మౌలిక సదుపాయాల కల్పన,నైపుణ్యాభివృద్ధి, అభివృద్ధిలో పారదర్శకత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. ఎపిలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి రాజస్థాన్ రాష్ట్రంలో అమలు చేసేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. అంతేగాక రాజస్థాన్ రాష్ట్రంలో అమలు చేసే వివిధ పథకాల్లో లోపాలను సరిచేసి మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు కృషి చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎపిలో పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పి-4 కార్యక్రమం అద్భుతంగా ఉందని ఆయన కితాబిచ్చారు.

ఈసమావేశంలో రాజస్థాన్ ప్రణాళికా శాఖ అధికారులు నిర్మల్ సేధి,వినేశ్ సింగ్, రాష్ట్ర ప్రణాళికా శాఖ డైరెక్టర్లు ఆర్ రాంబాబు,బి.గోపాల్,స్వర్ణాంధ్ర సిఇఓ సి హెచ్.నరేశ్ కుమార్,ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## జీఎస్టీ తగ్గడంతో రైతులకు మేలు

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- తిరువూరు ఐషర్ ట్రాక్టర్ షోరూమ్‌లో రైతులకు ట్రాక్టర్ల పంపిణీ

**తిరువూరు, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

తిరువూరు ఐషర్ ట్రాక్టర్ షోరూమ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు కొనుగోలు చేసిన ట్రాక్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ వ్యవసాయ రంగమే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్నారు. రైతు కష్టానికి తగిన గుర్తింపు రావాలంటే ఆధునిక పరికరాలు, సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, ఆ దిశగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని అన్నారు. ఇటీవల జీఎస్టీ తగ్గిన కారణంగా రైతులకు ట్రాక్టర్లు మరింత తక్కువ ధరకు లభిస్తున్నాయని, ఇది వ్యవసాయ రంగానికి చాలా పెద్ద మేలు చేస్తుందని ఆయన వివరించారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వాల ప్రథమ కర్తవ్యమని, ఎప్పటికప్పుడు రైతుల సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐషర్ కంపెనీ ఏజీఎం రమేష్ నాయుడు, టీఎం రసూల్, షోరూమ్ అధినేత కే. వినోద్, షోరూమ్ మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చర్చ్ ఆఫ్ క్రిస్ట్ చారిటబుల్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ



**ఆగిరిపల్లి, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

చర్చ్‌అఫ్ క్రిస్ట్ చారిటబుల్ మినిస్ట్రీస్ వారి ఆధ్వర్యంలో నిరుపేద వృద్దులకు బాలలకు దుస్తుల పంపిణి చేశారు.సగ్గూరు గ్రామమునందు స్థానిక క్రీస్తు సంఘము ఆధ్వర్యంలో సుమారు 50 మంది నిరుపేద వృద్దులు, మహిళలు ,మరియు బాలలకు దుస్తుల పంపిణి చేయడం జరిగినది. ఈ కార్యక్రమములో చర్చ్‌అఫ్ క్రిస్ట్ చారిటబుల్ మినిస్ట్రీస్ డైరక్టర్ బ్రదర్ డేన్నిరాజు, స్థానిక సంఘకాపరి బ్రదర్ కే.భాస్కరరావు, పరిచారకులు యల్మర్తి రాజారత్నం, బ్రదర్. చౌటపల్లి ఆదాం, మట్టా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానం.. విజయనగర ఉత్సవం



**విజయనగరం, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి సిరిమానోత్సవాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు జరిగే విజయనగర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయం నుంచి బొంకులదిబ్బ వరకు సాగిన శోభాయాత్రకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు జెండా ఊపారు. మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఫల, పుష్ప, చిత్ర ప్రదర్శనలు, సైన్స్ ఫెయిర్, పెట్ షో, నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి అనిత ఎమ్మెల్యే అదితితో కలిసి థింసా నృత్యం చేశారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు కోటలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు వేడుకలు నిర్వహించారు. ఆయన్ను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## కల్తీమద్యాన్ని అడ్డుకుంటే ప్రభుత్వంపై విమర్శలా?

### జగన్‌పై తెదేపా నేత సోమిరెడ్డి మండిపాటు

**నెల్లూరు, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**



'వైకాపా హయాంలో డిస్టిలరీలను బలవంతంగా లాక్కుని, అక్కడ తయారుచేసిన కల్తీ మద్యాన్ని ప్రభుత్వ డిపోలు, మద్యం దుకాణాల ద్వారా జనం నెత్తిన పోశారు. దాన్ని తాగి వేలమంది చనిపోగా.. లక్షల మంది అనారోగ్యం పాలయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నమయ్య జిల్లాలో కల్తీ మద్యం కేంద్రంపై ఎక్సైజ్ అధికారులు దాడిచేసి, నిందితులను అరెస్టు చేశారు. ప్రభుత్వం, అధికారులు సమర్థవంతంగా పనిచేస్తుండటాన్ని వైకాపా అధ్యక్షుడు జగన్ అభినందించాల్సింది పోయి విమర్శలు చేయడం దారుణం' అని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు.

# కాపు బలిజ వర్గాలకు బీసీ రిజర్వేషన్ ఇవ్వాలి






- గిరి బలిజ జీ ఓ 5 పై స్టేటస్ కో ను స్వాగతించిన రాష్ట్ర కాపు జేఏసీ
- కాపు కార్పొరేషన్ కి నిధులు, కాపు భావనా లు పూర్తి చేయాలి
- రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్

**ఒంగోలు, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

దొమ్మరులను గిరి బలిజ గా మారుస్తూ ఇచ్చిన జీ ఓ 5 పై స్టేటస్ కో ఇస్తూ జీ ఓ 7 ను ఇవ్వడాన్ని రాష్ట్ర కాపు జేఏసీ స్వాగతించింది. కాపు, బలిజ వర్గాల సమస్య ల పరిష్కారం కోరుతూ రాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలు లో జిల్లా కాపు సంఘ కార్యాలయ లో జరిగిన సమావేశం లో రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ పాల్గొన్నారు. ఆదివారం ఒంగోలులో లో జిల్లా కాపు సంఘ సంఘ సమావేశం అనంతరం రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్, శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ సోమరౌతు రామకృష్ణ, ప్రకాశం జిల్లా కాపు సంఘం అధ్యక్షులు కొక్కిరాల సంజీవ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. దొమ్మరులను గిరిబాలిజ లు గా మారుస్తూ జీ ఓ నెంబర్ 5 ను స్టేటస్ కో ఇస్తూ జీ ఓ 7 ను తెవడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కి, మంత్రి నారా లోకేష్ కి, బీసీ వెల్ఫేర్ శాఖా మంత్రి సవిత కి, ఆ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ కి, రాజ్య సభ సభ్యులు సాన సతీష్ కి చందు జనార్దన్ ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాల కాలం నుండి కాపు తెలగ బలిజ ఒంటరి కులాల కు బీసీ రిజర్వేషన్ అంశం పెండింగ్ లో ఉందని, 5 శాతం ఈ డబల్యూ ఎస్ రిజర్వేషన్ 5 శాతం గౌరవ కోర్ట్ పరిధి లో ఉందని రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ అంశం లో ప్రకటన చేసి పరిష్కారం చూపాలని చందు జనార్దన్ కోరారు. పెండింగ్ లో ఉన్న బలిజ కాపు వర్గాల సమస్య లు అనేకం ఉండగా ప్రభ్యత్వ పెద్దలు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని అయన ఆవేదన వ్యక్తం చేసారు. కాపు కార్పొరేషన్ కు నిధులు, కాపు భవనాలను పూర్తి చేయడం, కాపు బలిజ వర్గాల ఉద్యోగులకు ప్రాధాన్యత గల పోస్టుంగ్ లు ఇవ్వాలని, జనాభా దమాషా ప్రకారం మా వర్గాలకు రాజకీయ, నామినేటెడ్, పదవుల్లో అవకాశం కల్పించాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్ డిమాండ్ చేసారు. కాపు బలిజ వర్గాల సమస్యలు పరిష్కారం నోచుకోక పోతే జిల్లాల పర్యటన అనంతరం రాష్ట్ర వ్యాప్త సమావేశాలు కొనసాగుతాయని పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చందు జనార్దన్ తెలిపారు. సమావేశం ప్రారంభనికి ముందు స్వర్గీయ వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలతో చందు జనార్దన్, సోమ రౌతు రామకృష్ణ, కొక్కిరాల సంజీవ్ కుమార్, జిల్లా నేతలంతా నివాళులు అర్పించారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా ఆశయ సాధన కోసం కృషి చేస్తామని మాట్లాడారు. నారపు శెట్టి రామ్మోహన్, పొత్తూరి రాజ్య సులోచన, నల్లంశెట్టి హనుమంతరావు, సూరినేని పోలేరయ్య, తోట నారాయణ, తోట రామారావు, చింతపల్లి నారాయణ, మేకల నారాయణ, వాసన అంకబాబు, కే శ్రీనివాస్‌రావు, రావేళ్ల రాఘవ, బుదే రాం రాజకుమార్, మంగిశెట్టి శ్రీనివాసరావు, మణి, ఇందుర్తి నారాయణ, నరహరి సంబయ్య, మిరియాల వెంకటేశ్వర్లు, తెలప్రోలు శ్రీకాంత్ కుమార్ పాల్గొన్నారు.

## పిన్నిని నరికేసి.. 4 ముక్కలుగా చేసి..!

### గోనె సంచుల్లో కట్టి కాల్వల్లో పడేసిన వైనం

### విజయవాడలో దారుణం.. పోలీసుల అదుపులో తండ్రీకొడుకు



**విజయవాడ, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

కట్టుకున్న భర్తను, కుమారుడిని వదిలిపెట్టి పుట్టింటికి వెళ్లిపోయిందో మహిళ. దీనికి కారణం తన చిన్నమ్మేనని అప్పటి నుంచి రగిలిపోతున్నాడు ఆ ఇల్లాలి భర్త. ఆ కోపాన్ని 13 ఏళ్ల తర్వాత కొడుకుతో కలిసి తీర్చుకున్నాడు. ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి నరికి చంపి, నాలుగు ముక్కలుగా చేసి కాల్వల్లో పడేశాడు. విజయవాడలోని భవానీపురం హెచ్‌బీ కాలనీలో దసరా ముందు రోజు ఈ దారుణం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. భవానీపురం ఊర్మిళానగర్‌కు చెందిన పొత్తూరి విజయలక్ష్మి(65) కుమారుడితో కలిసి జీవిస్తోంది. కోడలు చనిపోవడంతో తల్లీకొడుకులిద్దరే ఇంట్లో ఉంటున్నారు. విజయలక్ష్మి అక్క కొడుకు వంకధార హనుమాన్‌జీ సుబ్రహ్మణ్యానికి భార్య హారిక, కుమారులు శ్రీమహావిష్ణు, ఇంటర్మీడియట్ చదువుతున్న 16 ఏళ్ల కుమారుడు, కుమార్తె శ్రీలక్ష్మి ఉన్నారు. భార్యాభర్తల మధ్య వివాదాలు రావడంతో 2012వ సంవత్సరానికి ముందు ఆమె పెద్దకుమారుడిని, కుమార్తెనూ తీసుకుని తిరువూరు వద్ద ఉన్న కంభంపాడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో సుబ్రహ్మణ్యం అప్పటి నుంచి రెండో కుమారుడితో కలిసి ఉంటున్నాడు. దీనికి చిన్నమ్మే కారణమని నాటి నుంచి సుబ్రహ్మణ్యం రగిలిపోతున్నాడు. ఈనెల ఒకటో తేదీన విజయలక్ష్మి ఇంటికి వెళ్లాడు. మంచిగా మాట్లాడి ఆమెను బైకుపై హెచ్‌బీ కాలనీలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. రెండో కుమారుడితో కలిసి ఇంట్లోనే పెద్ద కత్తితో మెడ నరికేశాడు. తర్వాత తండ్రీకొడుకులిద్దరూ కలిసి విజయలక్ష్మి శరీరాన్ని నాలుగు భాగాలుగా ముక్కలు చేశారు. వాటిని గోనె సంచుల్లో కుక్కి వేర్వేరు మురుగు కాల్వల్లో పడేశాడు. విజయలక్ష్మి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సుబ్రహ్మణ్యం ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది.

## పడిపోయిన 'టమాటా' ధరలు

### పత్తికొండలో కిలో రూ.4 పలికిన వైనం

### రైతుకు చేతికి వచ్చేది కిలో రూ.1 మాత్రమే!

**పత్తికొండ, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్లో టమాటా ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. పండగ ముందు వరకు కిలో రూ.8–10 పలకగా, ఆదివారం రూ.4 తగ్గిపోయింది. నిరాశకు గురైన కర్షకులు పంటను రోడ్డుపై పారబోశారు. అనంతరం ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. దాంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దిగుబడి విక్రయించగా వచ్చిన అరకొర సొమ్ములో మార్కెట్ కమీషన్, కోత కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతినుంచే చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లెక్కన టమాటా కిలో ఒక రూపాయి పలికినట్టైందని వాపోయారు.



# మీ పరిపాలన సిగ్గుచేటు

- ఇంత మంది ఉండి గాడిదలు కాస్తున్నారా?
- గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా?
- సీఎం చంద్రబాబు, మంత్రులపై వైఎస్ జగన్ ఆగ్రహం
- కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో పచ్చకామెర్లు సోకి ఇద్దరు బాలికలు మృతి చెందినా పట్టించుకోరా?
- ఆర్వో ప్లాంట్ చెడిపోయి మరెంతో మంది అనారోగ్యం పాలైనా స్పందించరా?

**అమరావతి, అక్టోబరు 6 (జర్నలిస్ట్ ఫైల్)**

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంటు పాడవ్వడంతో కలుషిత నీరు తాగి పచ్చ కామెర్లు సోకి నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు మృతి చెందడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మరెంతో మంది తీవ్ర అనారోగ్యం పాలవ్వడం తనను కలచి వేస్తోందన్నారు. 611 మంది చదువుతున్న పాఠశాలలో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా.. మీరు, ఇంత మంది మంత్రులు ఉండి గాడిదలు కాస్తున్నారా? అంటూ సీఎం చంద్రబాబుపై మండిపడ్డారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి పిల్లల ఆరోగ్యం పట్ల, బడుల్లో వసతుల పట్ల శ్రద్ధ పెట్టాలని హితవు పలికారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ



మేరకు ఆదివారం వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

చంద్రబాబు గారూ.. పాలనలో మీ నిర్లక్ష్యం, మీ అలసత్వం కారణంగా ఇవాళ పేద విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా మీకు కనికరం లేదు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంటు పాడవ్వడంతో కలుషిత నీరు తాగడం మూలాన, పచ్చ కామెర్లు సోకి నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు.

మరెంతో మంది తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వానికి, మీ పరిపాలనకు ఇది సిగ్గుచేటు వ్యవహారం కాదా? 611 మంది చదువుతున్న స్కూల్లో ఇంత జరుగుతున్నా అసలు పట్టించుకోరా? ఒక ప్రభుత్వం స్పందించాల్సిన తీరు ఇదేనా? ముఖ్యమంత్రిగా మీరు, ఇంత మంది మంత్రులు ఉండి గాడిదలు కాస్తున్నారా? గిరిజన బాలికలు, పేద పిల్లలు అంటే అంత చులకనా? ఒక్క పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఒక్క ఏడాదిలో 11 మంది విద్యార్థులు అనారోగ్యంతో మరణించినా మీరు కళ్లు మూసుకున్న మాట వాస్తవం కాదా? ఈ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే చంద్రబాబు గారూ.

పేదల తల రాతను మార్చేది చదువేనని మేం నమ్మి, అమ్మ ఒడి సహా ఎన్నో సంస్కరణలు తెస్తూ నాడు–నేడు పనుల ద్వారా ఆ స్కూళ్లను దేవాలయాలుగా మార్చాం. కరెంటు, లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, డిజిటల్ ప్యానెళ్లు, తాగు నీరు, మరుగు దొడ్లు సహా 11 రకాల మౌలిక సదుపాయాలను కల్పించాం. పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా రక్షిత తాగు నీటి కోసం ఆర్వో ప్లాంట్లు పెట్టాం. మా ప్రభుత్వ హయాంలో నిరంతర సమీక్ష, పర్యవేక్షణ ద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నాం.

మీరు అధికారంలోకి వచ్చాక, మీ సుపుత్రుడు విద్యా శాఖను చేపట్టిన తర్వాత, ప్రైవేటు వ్యక్తుల లాభాల కోసం వారితో చేతులు కలిపి.. క్రమంగా ప్రభుత్వ విద్యా సంస్థలను నాశనం చేసుకుంటూ వచ్చారు. మా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన మంచి పేరు ప్రతిష్టలను దెబ్బ తీశారు. ఇంగ్లిష్ మీడియంను, సీబీఎస్ఈ నుంచి ఐబీదాకా ప్రయాణాన్ని, టోఫెల్ క్లాసులు, స్కూలు పిల్లలకు ట్యాబులు, సబ్జెక్ట్ టీచర్స్ కాన్సెప్ట్‌ను, రోజుకో మెనూతో పెట్టే మధ్యాహ్న భోజనం గోరుముద్ద.. వీటన్నింటినీ నాశనం చేశారు. మీ దుర్మార్గాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు తగ్గిపోయారు.

ఆర్వో ప్లాంట్లు రిపేరు వస్తే వాటిని పట్టించుకునే నాథుడే లేడు. హాస్టళ్లలో విషాహారం కారణంగా మరణాలు సంభవించడమో, ఆస్పత్రుల పాలవ్వడమో పరిపాటిగా మారింది. ఇలాంటి మీ నిర్లక్ష్యమే ఇవాళ కురుపాం గురుకుల పాఠశాలలో గిరిజన బాలికల ఉసురు తీసింది. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఆ కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. ఇప్పటికైనా కళ్లు తెరిచి.. వెంటనే పిల్లల ఆరోగ్యం పట్ల, బడుల్లో వసతుల పట్ల శ్రద్ధ పెట్టాలి. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేస్తున్నాను. ఎందుకంటే ఇది ప్రభుత్వం చేసిన తప్పిదం కాబట్టి.

# విజయ్ టివికెతో బిజెపి అవగాహన!



## సంయమనం పాటించాలంటూ సలహా

**చెన్నై, అక్టోబరు 6 :** కరూర్ తొక్కిసలాట తర్వాత చిక్కుల్లో పడిన సినీ నటుడు, టివికే అధినేత విజయ్‌ను మచ్చిక చేసుకుని వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని లబ్ధి పొందాలని బిజెపి తహతహలాడుతోంది. ఇందులో భాగంగా కరూర్ ఘటనపై డిఎంకే ప్రభుత్వం టివికేని ఇబ్బంది పెట్టాలని చూస్తే తాము అండగా ఉంటామని బిజెపి సీనియర్ నాయకుడు ఒకరు విజయ్‌కి కబురు పంపించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కరూర్ ఘటనలో డిఎంకెని కూడా బాధ్యురాలిని చేయాలని తాము భావిస్తున్నామని, విజయ్ సంయమనం పాటించాలని ఆ నాయకుడు సూచించినట్లు వారు చెప్పారు. తన భవిష్యత్తు రాజకీయ ర్యాలీలపై సందిగ్ధంలో పడిన విజయ్‌ని తమ దారిలోకి తెచ్చుకుని ప్రజలలో ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్ ద్వారా ఎన్నికల లబ్ధి పొందాలన్నది బిజెపి ఆలోచనగా కనిపిస్తోంది. కరూర్‌లో ఇటీవల జరిగిన ఘోర దుర్ఘటనపై శనివారం తీవ్ర విచారం వ్యక్తం చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ ఘటనకు ఎవరు బాధ్యులో నిగ్గుతేల్చి, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై మద్రాసు హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను, చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఎక్స్ పోస్టులో స్టాలిన్ తెలిపారు. ఇదిలాఉంటే కరూర్‌లో విజయ్ ర్యాలీ దుర్ఘటనపై బిజెపి నేతలు కొంతమేర తటస్థవైఖరితో ఉండటాన్ని పరిశీలకులు గమనించారు. ఈ సంఘటనను అస్త్రంగా మలుచుకుని తమిళనాడులో టివికెతో అవగాహనకు వచ్చి డిఎంకెను ఓడించాలన్న లక్ష్యంతో బిజెపి అగ్రనేతలున్నట్లు తెలుస్తోంది. ఇందుకు తగినట్లుగానే బిజెపి మాజీ చీఫ్ అన్నామలై వ్యాఖ్యలు కూడా ఇటీవల అదే తరహాలో ఉన్నాయని నాయకులు చెవుతున్నారు. అయితే టివికెనుంచి ఇదే విషయమై ఎలాంటి స్పష్టత రాలేదు. ముందు విచారణ పూర్తి అయి నిర్దోషులుగా వచ్చిన తర్వాతనే ఎలాంటి వ్యాఖ్యలయినా చేయాలని పార్టీ సీనియర్ కేడర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు బిజెపి ఇంఛార్జ్‌గా నియమితులైన జయ్ పాండా ఈనెల 6న రాష్ట్ర పర్యటనకు రానున్నారు.

ఈ సందర్భంగా తమిళనాడులోని బిజెపి సీనియర్ నేతలు, పదాధికారులతో సమావేశం కానున్నారు. అటు, ఢిల్లీలో ఉన్న తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై.. కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటన వివరాలు, దాని రాజకీయ ప్రభావంపై పార్టీ నాయకులకు నివేదిక ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో డీఎంకేపై వ్యతిరేకత స్పష్టంగా ఉంటుందని భావిస్తోన్న బీజేపీ విపక్ష ఓట్ల చీలిపోకూడదనే వ్యూహంతో టివికెపై దృష్టి సారిస్తున్నారు.



## నలుగురి హత్యలపై న్యాయవిచారణ జరపాలి

### లేదంటే నేను జైలులోనే కొనసాగేందుకు సిద్ధమే!

### పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్

**లేహ్, అక్టోబరు 6 :** లడఖ్‌కు రాష్ట్రహోదాకోసం డిమాండ్ చేస్తూ ఇటీవల లేహ్ ప్రాంతంలో జనం నిరసనలకు దిగగా అల్లర్లు చెలరేగాయి. ఆ అల్లర్లలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 90 మందికి పైగా గాయపడ్డారు. దాంతో లఢఖ్ ఉద్యమ నేత సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన జైలు నుంచి ఓ సందేశంపంపారు. లఢఖ్ ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడంపై స్వతంత్ర్య దర్యాప్తు జరిపించాలని, లేదంటే తాను జైల్లోనే ఉండిపోయేందుకు సిద్ధంగా ఉన్నానని వాంగ్‌చుక్ తన సందేశంలో హెచ్చరించారు. కాగా, వాంగ్‌చుక్ ప్రస్తుతం జోధ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్నారు. సోదరుడు కాత్సే తాన్ దోర్జే లేతో పాటు న్యాయవాది ముస్తఫా హాజీలు ఆయనను కలిసిన సందర్భంగా ఈ సందేశాన్ని పంపారు. తాను శారీరకంగా, మానసికంగా బాగానే ఉన్నానని, తన కోసం ప్రార్థిస్తున్న వారికి ధన్యవాదాలు అని తన సందేశంలో వాంగ్‌చుక్ పేర్కొన్నారు. ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నానని, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాననిఅన్నారు. నలుగురి హత్యలపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు. లేదంటే తాను జైలులోనేఉండేందుకు సిద్ధంగా ఉన్నాననిచెప్పారు. లఢఖ్‌కు రాష్ట్రహోదా కోసం ప్రజలు, లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్‌చేస్తున్న డిమాండ్‌లకు మద్దతిస్తున్నానని పేర్కొన్నారు. ఈసందర్భంగా శాంతి, ఐక్యతను కాపాడుకోవాలన్నారు. అహింసా మార్గంలోనే మన పోరాటాన్ని శాంతియుతంగా కొనసాగించాలని ప్రజలకు సూచించారు. కాగా సోనమ్ వాంగ్‌చుక్ పిలుపుతోనే లేహ్‌లో ఆందోళనలు జరిగాయని ఆరోపించిన కేంద్రం జాతీయ భద్రతాచట్టం కింద ఆయనను అరెస్ట్ చేయించింది. ఈ చట్టం కింద అరెస్టయిన వ్యక్తిని విచారణ చేయకుండా 12 నెలలపాటు నిర్బంధించేందుకు చట్టం అనుమతిస్తుంది. ఈ క్రమంలోనే తన భర్తను విడుదల చేయాలంటూ వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జే ఆంగ్మో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది.




## దగ్గుమందు తాగి 11 మంది చిన్నారుల మృతి

### చీటీ రాసిన డాక్టరు అరెస్టు

**భోపాల్, అక్టోబరు 6 :** మధ్యప్రదేశ్‌లోని చింద్వారాలో 11 మంది చిన్నారుల మృతికి కారణమైన దగ్గుమందు రాసిన డాక్టర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కోల్డ్రిఫ్ దగ్గు సిరప్ తాగిన పక్షంరోజుల్లోనే చిన్నారులు కిడ్నీ ఫెయిల్ అయి మృతిచెందారు. ఈనేపథ్యంలో కాఫ్ సిరప్‌సూచించిన డాక్టర్ ప్రవీణ్‌సోనీని వరాసియా ప్రాంతంలో అదువులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం ప్రకటించారు. ప్రభుత్వ డాక్టర్ అయిన ప్రవీణ్ చింద్వారాలో ప్రైవేట్ క్లినిక్ నడుపుతున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి చికిత్స కోసం తన వద్దకు వచ్చిన చిన్నారులకు ఆయన కోల్డ్రిఫ్ సిరప్‌ను సూచించారు. దీంతో 11మంది చిన్నారులు అస్వస్థతకు గురై మరణించారు. ఈ నేపథ్యంలో కోల్డ్రిఫ్‌సిరప్‌అమ్మకాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిషేధించింది. డాక్టర్‌పై కేసునమోదుచేసిన పోలీసులు అదుపులోకి తీసుకుంది.ఆసిరప్‌ను ఉత్పత్తి చేస్తున్న శ్రీసన్ ఫార్మా స్యూటికల్స్‌పై ప్రభుత్వం కేసు నమోదుచేసింది. ఈ డ్రగ్ కిడ్నీలకు హాని కలిగించే విషపూరిత పదార్థాలతో కలుషితమైనట్లుగా అనుమానిస్తున్నారు.

## పాక్‌తో భారత్‌కు ఇబ్బందికలిగే ఒప్పందమేమీ రష్యాకులేదు!

### క్రెమ్లిన్ ప్రతినిధి వెల్లడి



**మాస్కో, అక్టోబరు 6 :** ఫైటర్ జెట్ ఇంజిన్ల సరఫరా, తయారీకోసం పాకిస్తాన్‌తో రష్యా ఒప్పందం జరిగిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని నిజానికి పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందమేదీ చేసుకోలేదని భారత్‌కు ఇబ్బందికరంగా అనిపించేంత పెద్ద ఒప్పందాలను తాము ఆదేశంతో చేసుకోలేదని రష్యా స్పష్టం చేసింది. భారత్‌కు ఇబ్బందికరంగా మారే చర్యలు తాము చేపట్టబోమని స్పష్టం చేసింది.

పాకిస్థాన్‌తో అలాంటి ఒప్పందం జరిగినట్లు ఎలాంటి ఆధారం లేదు. రానున్న కొద్ది రోజుల్లో రష్యా, భారత్ మధ్య పెద్ద ఒప్పందాలు జరుగుతాయని విశ్లేషించే పరిశీలకులకు ఈ వార్తల్లో లాజిక్ కనిపించదు. భారత్ ఇబ్బందిగా ఫీల్ అయ్యేంత పెద్ద ఒప్పందం పాకిస్తాన్‌తో రష్యా చేసుకోలేదు. పాక్‌తో ఆ స్థాయి సహకారం లేదు. భారత్, రష్యాల మధ్య చాలా ఉన్నత స్థాయిలో పరిచయాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంలో ఇరు దేశాల సహకారాన్ని చెడగొట్టేలా ఎవరో ప్రయత్నాలు చేస్తున్నారని క్రెమ్లిన్ వర్గాలు చెప్పినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ యుద్ధ విమానాల కోసం రష్యా ఇంజిన్లను సరఫరా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. పాక్‌లో ఉన్న చైనా తయారీ ఫైటర్ జెట్లలో వాడే ఇంజిన్లను రష్యా సరఫరా చేస్తోందని పలు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ వార్తలు దేశంలో పొలిటికల్ హీట్‌ను పెంచాయి. ప్రభుత్వ వైఖరిపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశాయి.

బిజెపిపై కాంగ్రెస్ తీవ్రవిమర్శలుచేసింది. ప్రధాని నరేంద్ర మోడీ రష్యాను అత్యంత సన్నిహితమైన వ్యాపార భాగస్వామిగా చెబుతారని కానీ ఆ దేశం మన శత్రువుకు మద్దతునిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆరోపణలు గుప్పించారు. మోడీది వ్యక్తిగతమైన దౌత్యం అని ఎద్దేవాచేశారు. రష్యా, పాక్‌మధ్య ఒప్పందం ఇతర దేశాలతో సంబంధాల విషయంలో ప్రధాని వైఫల్యాన్ని సూచిస్తుందని మండిపడ్డారు. ఆయన జాతీయ ప్రయోజనాలకంటే తనకు పేరు వచ్చే విషయాలకే ప్రాధాన్యతనిస్తారని ఘాటుగా వ్యాఖ్యానించారు. రష్యా ఎందుకు పాక్‌కు సహకారాన్ని అందిస్తుందో ప్రభుత్వం చెప్పి తీరాలన్నారు.

## కోళ్లు, గొర్రెల వివరాలు అడగవద్దని చెప్పా

### కుల గణనపై కర్ణాటక డిప్యూటీ సిఎం డికె శివకుమార్

**బెంగళూరు, అక్టోబరు 6 :** కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన కులగణన పూర్తి కావడానికి ఇంకా మూడు రోజులే మిగిలి ఉండడంతో.. అధికారులు సర్వేను మరింత వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులగణనకు వెళ్లే అధికారులకు ముందే తాను పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలను వారికి ఎన్ని కోళ్లు, గొర్రెలు, మేకలున్నాయి? ఎంత బంగారం ఉందనే వ్యక్తిగత ప్రశ్నలు, వివరాలు అడగవద్దని సూచించానన్నారు. సర్వే చేస్తున్న సమయంలో ప్రజలు పంచుకోలేని వ్యక్తిగత ప్రశ్నలు అడగవద్దని చెప్పినట్లు తెలిపారు. కానీ సర్వే నిర్వహించే అధికారులు స్వతంత్ర కమిషన్‌కు చెందిన వారు కాబట్టి.. ఆ సమయానికి వారు ఏమి చేస్తున్నారో తెలియదన్నారు.

రూ. 420 కోట్ల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్న ఈ సర్వేలో 60 ప్రశ్నల ప్రశ్నావత్రం ఉందని.. అందులో అడిగే అన్ని ప్రశ్నలకు కచ్చితంగా సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం లేదని శివకుమార్ అన్నారు. సమాధానం చెప్పడం ఇష్టం లేకపోతే అధికారులు వారిని బలవంతం చేయకూడదని కోర్టు సైతం పేర్కొన్నట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అభ్యంతరాలను, ఖర్చును ప్రస్తావిస్తూ, ఎవరు ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా కులగణనను పూర్తి చేస్తామన్నారు.

2015లో కర్ణాటక వెనకబడిన వర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్రంలో మరోసారి కులగణనను చేపట్టింది. సెప్టెంబరు 22న ప్రారంభమైన ఈ సర్వే ఈ నెల 7న ముగియనుంది.

## భారీ వర్షాలకు విరిగిపడిన కొండచరియలు

### 17 మంది మృతి, మరికొందరికి గాయాలు



**డార్జిలింగ్, అక్టోబరు 6 :** పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్‌లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనల్లో మృతుల సంఖ్య 17కు చేరింది. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. మరికొందరికి తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. ఘటనా ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు బాలసోన్ నదిపై దూదియా వద్ద సిలుగుడిమరిక్ ప్రాంతాలను కలిపే ఇనుప వంతెన కుప్పకూలింది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. కలింపాంగ్ జిల్లాలో భారీ వర్షాల కారణంగా పరిస్థితి దారుణంగా మారింది. 717 జాతీయ రహదారిపై కొండచరియలు విరిగి పడడంతో సిక్కిం-సిలిగురి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. తీస్తా, మాల్ పర్వత ప్రాంత నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. భూటాన్‌లో భారీ వర్షాలతో బెంగాల్‌కు ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉంది. ప్రజలందరూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు డార్జిలింగ్‌లోని పర్యాటక ప్రదేశాలను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు తూర్పు నేపాల్‌లోని కోషి ప్రావిన్స్‌లో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొండచరియలు విరిగివడ్డాయి. 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. ఇలామ్ జిల్లాలో ఐదుగురు మరణించగా పటేగాన్, మన్సే బుంగ్, ద్యూమా, ధుసుని, రత్మాటే, ఘోసాంగ్ ప్రాంతాలలో మరో తొమ్మిది మంది మరణించారని అధికారులు తెలిపారు. సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుండటంతో హెలికాప్టర్లను రంగంలోకి దింపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు

## మణిపూర్‌లో ప్రభుత్వ పునరుద్ధరణకు బీరేన్‌సింగ్ కసరత్తు

**ఇంఫాల్, అక్టోబరు 6 :** మణిపూర్ మాజీ సిఎం బీరేన్ సింగ్ నేతృత్వంలో బిజెపి ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాంవేశారు. ప్రస్తుతం రాష్ట్రపతి పాలనలో ఉన్న ఆరాష్ట్రంలో ప్రభుత్వం పునరుద్ధరణ కోసం ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి తెచ్చేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యేలు హెచ్ డింగో, రాబిన్‌ద్రో, ఎస్ రంజన్, మాజీ మంత్రి గోవిందాస్ కొంథోజామ్, హిల్ ఏరియాస్ కమిటీ చైర్మన్ డింగాంగ్లంగ్ గంగ్మేయ్ ఈబృందంలో ఉన్నారు. హోంమంత్రి అమిత్ షా, జెపినడ్డా, ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రధాని బిజీ షెడ్యూల్ దృష్ట్యా ఆయనను వారు కలుస్తారా లేదా అన్నది సందేహంగా ఉన్నది. కాగా, బిజెపి కేంద్ర నాయకత్వాన్ని కలవడం, మణిపూర్‌లో కొత్తప్రభుత్వాన్ని త్వరగా ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేయడం లక్ష్యంగా తాము ఢిల్లీకి చేరినట్లు బీరేన్‌సింగ్ తెలిపారు. రెండేళ్లుగా జాతి హింసతో ఆ రాష్ట్రం రగిలిన నేపథ్యంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం పదవికి ఆయన రాజీనామా చేశారు. దీంతో ఫిబ్రవరి 13 నుంచి రాష్ట్రపతి పాలన అమలులోకి వచ్చింది. మరోవైపు ఆగస్టులో పార్లమెంటు ఆమోదంతో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు కేంద్రం పొడిగించింది. అయితే ఆ రాష్ట్రం కేంద్ర పాలనలో ఉన్నప్పటికీ అసెంబ్లీని రద్దు చేయలేదు. అసెంబ్లీని సస్పెన్షన్‌లో ఉంచారు.

## హమాస్ నిరాయుధీకరణలో వెనక్కితగ్గేదిలేదు

### ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు



**జెరూసలెం, అక్టోబరు 6 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికకు హమాస్ పాక్షికంగా అంగీకరించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. హమాస్‌ను నిరాయుధీకరణ చేసే విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఈ లక్ష్యాన్ని మంచి మాటలతో అయినా లేదా సైనిక చర్యతో అయినా సాధించి తీరతామని ఆదివారం స్పష్టం చేశారు. ఈ పరిణామం గాజా శాంతి చర్చల భవిష్యత్తుపై కొత్త సందేహాలను రేకెత్తిస్తోంది. డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో తెరపైకి వచ్చిన శాంతి ప్రణాళికలో భాగంగా యుద్ధాన్ని ముగించడం, బందీల విడుదల, గాజా పునర్నిర్మాణం వంటి కొన్ని అంశాలకు హమాస్ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో నెతన్యాహు విడుదల చేసిన ఒక వీడియో సందేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ ప్రణాళిక ప్రకారం దౌత్యపరంగా లేదా మా సైనిక మార్గంలో హమాస్‌ను నిరాయుధీకరణ చేస్తాం. గాజాను నిస్సైనికీకరణ చేసి తీరతాం. ఇది సులభంగా జరగవచ్చు లేదా కఠినంగానైనా మేం చేసి చూపిస్తామని నెతన్యాహు హెచ్చరించారు. గాజాలో ఇజ్రాయెల్ సైన్యం నియంత్రణలో ఉన్న ప్రాంతాల నుంచి పూర్తిగా వైదొలగే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, బందీల విడుదల విషయంలో నెతన్యాహు ఆశాభావం వ్యక్తం చేశారు. మనం ఒక గొప్ప విజయం అంచున ఉన్నాం. రాబోయే కొద్ది రోజుల్లో, సుక్కోత్ పండుగ సమయంలోపే మన బందీలందరూ (మరణించిన వారితో సహా) తిరిగి వస్తారనే శుభవార్తను మీకు అందించగలనని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ అంశంపై సోమవారం ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధుల మధ్య కీలక చర్చలు జరగనున్నాయి. శాంతి చర్చలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ట్రంప్ హెచ్చరికలను సైతం లెక్కచేయకుండా ఇజ్రాయెల్ జరిపిన తాజా వైమానిక దాడుల్లో ఆరుగురు మరణించినట్లు గాజా అధికారులువెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రాథమికంగా వెనక్కి వెళ్లేందుకు ఇజ్రాయెల్ అంగీకరించిందని, హమాస్ ధ్రువీకరించిన వెంటనే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

## సంక్షిప్తంగా..

### కరూర్ తొక్కిసలాట పక్కా ప్రణాళికతో చేసిందే: ఖుష్బూ

**చెన్నై, అక్టోబరు 6:** టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ ర్యాలీలో తొక్కిసలాట ఘటనపై నటి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఖుష్బూసుందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది పక్కా ప్రణాళికతో, కావాలని చేసినట్లు కన్పిస్తోందని ఆరోపిస్తూ.. తమిళనాడు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. తొక్కిసలాట ఘటనలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించిందని ఖుష్బూ పేర్కొన్నారు. ఇది ఎవరో కావాలని సృష్టించినట్లు ఉందన్నారు. విజయ్ ర్యాలీకి ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని విమర్శించారు. 41 మంది ప్రాణాలు కోల్పోయారని.. మౌనంగా ఉన్న సిఎం స్టాలిన్ దీనిపై మాట్లాడాలన్నారు. ర్యాలీలో పోలీసులు లాఠీచార్జి ఎందుకు చేశారని ఆమె ప్రశ్నించారు. దీనిని సంబంధించిన చాలా విడియోలు బయటకు వచ్చాయన్నారు. కరూర్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి టివికెకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు.

### భారత్ నుంచి అంటార్కిటికాకు రవాణా విమానం!



**పనాజీ, అక్టోబరు 6:** భారత్‌నుంచి నేరుగా అంటార్కిటికాకు తొలిసారి రవాణా విమానం వెళ్లింది. దీనిలో భారీ సైన్స్‌పరికరాలను పంపించారు. ఇందుకోసం రష్యా తయారీ ఐఎల్-76 అనే భారీ విమానం వినియోగించారు. దీనిని డ్రోనింగ్ మౌడ్ ల్యాండ్ అండ్ ఎయిర్ నెట్‌వర్క్ నిర్వహిస్తోంది. ఈ విమానంలో మొత్తం 18 టన్నుల దుస్తులు, ఔషధాలు, నిత్యావసరాలను పంపించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ విమానం గోవాలోని మనోహర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరి వెళ్లింది. ఇది దక్షిణాఫ్రికాకు వెళ్లి.. అక్కడి కేప్‌టౌన్ నగరం మీదుగా తన గమ్యాన్ని చేరుకోనుంది. మన దేశం అంటార్కిటికాలో భారతీ, మిత్ర అనే రెండు రీసెర్చి బేస్‌లను నిర్వహి స్తోంది. 1981 నుంచి భారత్ అంటార్కిటికాలో ప్రయోగాలు చేస్తోంది. ప్రస్తుతం భౌగోళిక రాజకీయ మార్పులు, అనుమతుల కోసం సుదీర్ఘకాలం ఎదురుచూడాల్సి రావడం, సముద్ర మార్గంలో తరలింపు ఆధారపడదగ్గది కాకపోవడం వంటివి నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చికి ఆందోళనకరంగా మారాయి.

### అలనాటి బాలివుడ్‌నటి సంధ్యాశాంతారామ్ కన్నుమూత



**ముంబయి, అక్టోబరు 6 :** ప్రముఖ హిందీ సినీ నటి, దిగ్గజ దర్శకుడు వి. శాంతారామ్ సతీమణి సంధ్యా శాంతారామ్ (94) కన్నుమూశారు. వయోభారంతో కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడు తున్న ఆమె తన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారని సమాచారం. ఆమె మరణం పట్ల చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. సంధ్యా శాంతారామ్ సినీ రంగంలో సుదీర్ఘకాలం పాటు తనదైన ముద్ర వేశారు. ఆమె హిందీతో పాటు మరాఠీ సినిమాల్లో కూడా విజయవంతంగా నటించారు. అమర్ భూపాలి, ఝనక్ ఝనక్ పాయల్ బాజే, నవరంగ్, పింజారా వంటి చిత్రాలు ఆమెకు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఈ చిత్రాలలో ఆమె పోషించిన పాత్రలు, ముఖ్యంగా ఆమె నృత్య ప్రదర్శనలు ఆమెను కలల నటిగా నిలిపాయి. నృత్యకళలో ఆమె చూపిన ప్రత్యేక ప్రతిభ ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. సంధ్యా శాంతారామ్ మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం చేశారు.

### ఖలిస్థానీ వేర్పాటువాదసంస్థలకు కెనడానుంచే నిధులు!

**టొరంటో, అక్టోబరు 6 :** ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థలకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయన్న వాస్తవాన్ని కెనడా ప్రభుత్వం తొలిసారి అధికారికంగా అంగీకరించింది. దేశంలోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఫండింగ్‌పై విడుదల చేసిన ఒక కీలక నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా తెలిపింది. సేవా సంస్థల ముసుగులో జరుగుతున్న ఈనిధుల మళ్లింపుపై కెనడా ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కెనడా ఆర్థిక శాఖ ఇటీవల విడుదల చేసిన అసెస్‌మెంట్ ఆఫ్ మనీలాండరింగ్, టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ రిస్క్స్ ఇన్ కెనడా 2025నివేదికలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ సిక్ యూత్ ఫెడరేషన్ వంటి ఖలిస్థానీ వేర్పాటువాద గ్రూపులతో పాటు హమాస్, హెజ్‌బొల్లా వంటి సంస్థలు కూడా కెనడాలోని వ్యక్తులు, సంస్థల నుంచి ఆర్థిక సహాయం పొందుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది.

## కేరళ అదృశ్య వ్యక్తికి రూ.25 కోట్ల బంపర్ లాటరీ



**తిరువనంతపురం, అక్టోబరు 6 :** కేరళకు చెందిన ఓ వ్యక్తి జాక్ పాట్ కొట్టాడు. కేరళ తిరువోణం బంపర్ లాటరీలో గుర్తుతెలియని వ్యక్తి రూ.25 కోట్లు గెలుచుకున్నాడు. అయితే లాటరీ ఫలితాలు ప్రకటించి ఒక రోజైనా లాటరీ మొదటి బహుమతి విజేత ఎవరో ఇంకా మిస్టరీగానే ఉంది. విజేతకు లాటరీ టికెట్ (టిహెచ్ 577825) ఎర్నాకుళంలోని నెట్టూర్‌కు చెందిన లాటరీ ఏజెంట్ లతీఫ్ విక్రయించారని వెల్లడైంది. అయితే లాటరీ ప్రైజ్‌ను అందుకునేందుకు విజేత ఇంకా ముందుకు రాకపోవడం గమనార్హం. మరోవైపు, లాటరీలో రూ.25 కోట్లు గెలుచుకున్న వ్యక్తి నెట్టూర్ ప్రాంత వాసేనని తెలుస్తోంది. అజ్ఞాత వ్యక్తికి లాటరీ టికెట్‌ను డ్రాకు కేవలం ఒక రోజు ముందు అమ్మానని లతీఫ్ చెప్పాడు. అయితే దానిని ఎవరు కొన్నారో తనకు కచ్చితంగా తెలియదన్నాడు. తొలుత కొబ్బరి నూనె వ్యాపారి అయిన లతీశ్, ఇప్పుడు లాటరీ ఏజెన్సీని నడుపుతున్నాడు. రూ.25 కోట్ల విజేతకు టికెట్ అమ్మడం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో అందరీ దృష్టిని ఆకర్షించాడు. ఈ సంవత్సరం తిరువోణం బంపర్ (బీఆర్92) టికెట్లను అమ్మడం పట్ల లతీశ్ చాలా సంతోషంగా ఉన్నాడు. లాటరీలో మొదటి బహుమతి టికెట్‌ను లతీఫ్ అమ్మడం గత మూడు నెలల్లో ఇది రెండో సారి. ఈ క్రమంలో తాను సాధించిన ఘనత గురించి లతీశ్ ఆనందం వ్యక్తం చేశాడు. నేను అమ్మిన టికెట్ బహుమతి గెలుచుకున్నందుకు నేను 100 శాతం సంతోషంగా ఉన్నాను. నేను దేవునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలని లతీశ్ అన్నాడు. రూ. 25 కోట్ల బంపర్ బహుమతిని అమ్మే ఏజెంట్‌కు దాదాపు 10 శాతం అంటే రూ. 2.5 కోట్ల కమీషన్ లభిస్తుంది. ట్యాక్స్ రూ. 6.6 కోట్లుపోనూ రూ.15.40 కోట్లు ఉంటుంది. మొత్తం ఆదాయం రూ.15 కోట్లు దాటినందున పన్నుపై 37శాతం సర్ ఛార్జ్ (సుమారు రూ2.5 కోట్లు)ను విధిస్తారు. ఇవన్నీ పోనూ మిగతా డబ్బులు లాటరీ విజేతకు దక్కుతాయి. బంపర్ లాటరీ టికెట్లు రిలీజ్‌మరోవైపు, పూజ బంపర్ లాటరీ టికెట్లను కేరళ ఆర్థిక మంత్రి కె.ఎన్. బాలగోపాల్ విడుదల చేశారు. తిరువనంతపురంలోని గోర్కీ భవన్‌లో జరిగిన తిరువోణం బంపర్ డ్రా వేడుకకు ముందు ఈ టికెట్లను రిలీజ్ చేశారు. ఈ పూజ బంపర్ లాటరీ డ్రాలో మొదటి బహుమతి విజేతకు రూ.12 కోట్లు అందుతాయి. ఈ బంపర్ లాటరీ టికెట్ ధర రూ.300గా నిర్ణయించారు. 3,32,130 మంది బహుమతులు అందజేయనున్నారు. పూజ బంపర్ లాటరీ డ్రా నవంబర్ 22న మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుంది.

## హరిత గుంటూరు ఆవిష్కృతం కావాలి




○ గుంటూరు జిల్లా కలెక్టర్ వెల్లడి

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు జిల్లాను పచ్చదనంతో నింపి హరిత గుంటూరును ఆవిష్కృతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. వనం – మనం జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. హరిత గుంటూరు జిల్లాలో అన్ని శాఖలు సమష్టిగా, సమన్వయంతో పనిచేయాలని అన్నారు. విద్యా సంస్థలు, ఇతర కార్యాలయాలు, ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలు, వాటిని సాధించిన లక్ష్యాలుపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీలో మొక్కలు నాటుటకు కార్యాచరణ సమర్పించాలని అన్నారు.

జిల్లా అటవీ అధికారి హిమ శైలజ మాట్లాడుతూ 2,443 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న జిల్లాలో కేవలం 47.80 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో, 1.90 శాతం మేర మాత్రమే పచ్చదం ఉందన్నారు. మిషన్ హరిత ఆంధ్ర ప్రదేశ్ లో భాగంగా 2029 సంవత్సరం నాటికి 37 శాతం పచ్చదనం ఉండాలన్నారు. 2025 – 26 సంవత్సరంలో అన్ని శాఖల సమన్వయంతో 330 హెక్టార్లలో మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా 503 హెక్టార్లలో మొక్కలు నాటడం జరిగిందన్నారు. 2026 – 27 సంవత్సరంలో 311 హెక్టార్లలోను, 2027 – 28 సంవత్సరంలో 335 హెక్టార్లలోను, 2028 – 29 సంవత్సరంలో 344 హెక్టార్లలోను, 2029 –30 సంవత్సరంలో 365 హెక్టార్లలోను పచ్చదనం పెంచుటకు లక్ష్యంగా ఉందన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, ముఖ్య ప్రణాళిక అధికారి శేష శ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులను సన్మానించిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ )** : బ్రహ్మంగారి మఠం మండలానికి చెందిన జర్నలిస్టులను శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు అయ్యాపు వెంకట సురేష్ బాబు వారి కమిటీ తరఫున సోమవారం ఘనంగా సన్మానించారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను ప్రతిరోజు స్థానిక విలేకరులు ఇక్కడ జరిగే కార్యక్రమాలను వారి పత్రికల ద్వారా ప్రచురించి పాఠకులకు తెలియపరచడం జరిగిందని, దీనికి కృతజ్ఞతగా దేవస్థానం కమిటీ తరపున శాలువా వేసి ఈ చిన్న సత్కారం చేయడం జరిగిందని అధ్యక్షులు అయ్యాపు వెంకట సురేష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా విలేకరులందరికీ కమిటీ తరపున పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ముచ్చర్ల శేషయ్య, పబ్బతి నాగేశ్వరరావు అలాగే దేవస్థానం అర్చకులు రంగసముద్రం మధుసూదన శర్మ తదితరులు హాజరయ్యారు.

# పేదలకు ఆరోగ్య రక్ష సీఎంఆర్ఎఫ్

○ రూ.26 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నసీర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :పేద ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం, ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, ఆరోగ్య రక్షణ కవచంగా సీఎంఆర్ఎఫ్ ఉపయోగపడుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలో లబ్ధిదారులకు రూ. 26 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సోమవారం స్థానిక తూర్పు శాససనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా ఒక్కరూ కూడా ఇబ్బందులకు పడకూడదనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు సహకారంలో పేద వర్గాల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ. 5.41 కోట్ల మేర సీఎంఆర్ఎఫ్ నిధులతో ప్రజల ప్రాణాలు కాపాడామని వెల్లడించారు. రాష్ట్రంలో వైద్య రంగానికి అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రిలో అవసరమైన పరికరాలు, సిబ్బంది కొరత, సమస్యలపై కొద్ది రోజుల క్రితం ఆరోగ్య శాఖ కమిషనర్ కు విన్నవించామని వివరించారు. త్వరలోనే జీజీహెచ్ కు మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో కనీస వసతులు కూడా లేకుండా పేదలకు వైద్యం అందించేవారని, దీంతో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే వారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా సిద్ధం చేశామని, దీంతో ఓపీ కూడా పెరిగిందని అన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమ కుటుంబాలను పెద్ద మనసుతో ఆదుకున్న సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిశీలికలు గంజాం రాఘవేంద్ర, జాగర్లమూడి శ్రీనివాసరావు, గోళ్ళ ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, బత్తిని శంకర్, వేల్పూరి కిరణ్, పఠాన్ జమీర్, చల్లా ఆంజనేయ ప్రసాద్, వంగర ఏడుకొండలు, కోటా పిచ్చిరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, చామర్తి ఆనంద్ సాగర్, ఎస్ ఎస్ పి జాదా, నిజాముద్దీన్, చెట్టు కనకారావు, వాసు కాసింబాబు, డివిజన్ అధ్యక్షులు అబ్దుల్ సలీం, తాడిపోయిన చిన్న బుజ్జి, గుడిమెట్ల దయారత్నం, ఎర్రగుంట్ల ఆనంద్, బత్తిని దినేష్, ముకుందరావు, వహీద్, బాబురావు, వజ్జా లక్ష్మి, అన్వర్, అఖాని, ఫారూఖ్, హుస్సేన్, ఏలూరి నరేంద్ర ,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు, డ్రైన్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

○ నగర కమిషనర్ వెల్లడి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** గుంటూరు నగరంలో రోడ్లు, డ్రైన్లు ఆక్రమణ చేసి మురుగు, వర్షం నీటి పారుదలకు అడ్డుగా ఉన్నవాటిని స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే ప్రజా సౌకర్యార్థం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది, అధికారులు తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ పట్టాభిపురం మెయిన్ రోడ్, అమరావతి రోడ్, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్ ఆక్రమణలను పరిశీలించి, వాటి తొలగింపుకు ఆక్రమణదారులు, పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రైన్ల ఆక్రమణలను తొలగించామని, అందువల్లనే వర్షం కురిసిన కొద్ది సమయానికే నీరు బెయిల్ అవుట్ అవుతుందన్నారు. కాని ఇప్పటికే పలుమార్లు తొలగించుకోవాలని సూచించినప్పటికీ కొందరు ప్రధాన డ్రైన్లను ఆక్రమణ చేసి వ్యాపారాలు చేస్తున్నారని, అటువంటి ఆక్రమణలను తక్షణం తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అమరావతి రోడ్ లోని హిందూ ఫార్మసీ కాలేజి ఎదుట డ్రైన్ మీద ఉన్న ఆక్రమణను ఇప్పటికీ 3 పర్యాయాలు తొలగించినా, తిరిగి ఏర్పాటు చేయడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఆక్రమణలను తక్షణం తొలగించి, ఆక్రమణలు పునరావృతం కావడంపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిటి ప్లానర్ ని ఆదేశించారు. వార్డ్ సచివాలయాల వారీగా ఇప్పటికే వర్షం నీరు కాల్వలోకి వెళ్లడం లేదని, ఇళ్ళు మునుగుతున్నాయని, రోడ్ల మీద వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ప్రజల నుండి విపరీతమైన ఫిర్యాదులు అందుతున్నా, డ్రైన్లపై ఆక్రమణల తొలగింపుపై పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం ఎందుకు అని ప్రశ్నించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం 202, 137 సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, 137 శానిటేషన్ కార్యదర్శి క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ ని ఆదేశించారు. పర్యటనలో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటన షెడ్యూల్ రూపొందిస్తున్న నేతలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ నెలలో చేపట్టే పర్యటనలకు షెడ్యూలు రూపొందిస్తున్నారు. తొలుత పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వెళ్తారు. అక్కడి గురుకుల పాఠశాలలో విద్యార్థినులు అనారోగ్యంతో ఆసుపత్రి పాలయిన క్రమంలో ఆ పాఠశాలను పరిశీలిస్తారు. తదుపరి పిఠాపురం నియోజకవర్గంలో పర్యటన ఉంటుంది. ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో పర్యటిం చాలని నిర్ణయించారు. రాజోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ పర్యటన తేదీలు త్వరలో ఖరారు చేస్తారు. ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం ఆ ప్రాంత జన సైనికులు, వీర మహిళలు, నాయకులతో భేటీ

# ఘనంగా స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల బహుకరణ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్టు ఫైల్)**: స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల జిల్లా స్థాయి బహుకరణ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు శాసన సభ్యులు డా. బూర్ల రామాంజనేయులు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 5 రాష్ట్ర స్థాయి అవార్డులు, 48 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయన్నారు. స్వచ్ఛ నగర, మండలాలు, స్వచ్ఛ గ్రామ పంచాయతీలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ కార్యాలయాలు, స్వచ్ఛ రైతు బజార్లు, స్వచ్ఛ బస్ స్టేషన్లు, స్వచ్ఛ పరిశ్రమలు మొదలైన వివిధ విభాగాలలో అవార్డులకు ఎంపిక చేయడం జరిగిందని వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రోత్సాహక అవార్డులు – 2025కు, స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రకార్యక్రమాల కింద స్వచ్ఛతా కార్యకలాపాలపై చేసిన ప్రశంశనీయ కృషిని గుర్తించడానికి ప్రభుత్వం అవార్డులను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందేనని అన్నారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, బహిరంగ ప్రదేశాలలో శుభ్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, RRR (తగ్గించటం, మళ్లీ ఉపయోగించడం, రీసైకిల్), సుస్థిర పద్ధతులలో కొత్త ప్రమాణాలను నిర్ణయించడం తదితర అంశాలలో అవార్డు గ్రహీతలు పని చేయడం జరిగిందన్నారు. అవార్డులను మొత్తం 17 కేటగిరీలలో ప్రభుత్వం ఇవ్వడం జరిగిందని చెప్పారు. వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభను గుర్తించడానికి, అన్ని రంగాలలో ఉన్న వారి భాగస్వామ్యం పెంచుటకు స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ప్రతి మూడవ శనివారం స్వర్ణ ఆంధ్రా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో ఒక ఉద్యమం లాగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రమైన – హరితహితమైన గుంటూరు జిల్లాను ఆవిష్కృతం చేద్దామని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు డా. బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్రా – స్వచ్ఛ ఆంధ్ర – ఆరోగ్య ఆంధ్రాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం గొప్ప విషయం అన్నారు. స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా 36 లక్షల మరుగుదొడ్లు నిర్మించిన ఘనత ముఖ్య మంత్రిది అన్నారు. చెత్త నుంచి సంపద సృష్టించిన ఘనత కూడా ముఖ్యమంత్రిది అన్నారు. జీవన ప్రమాణాలు పెరగాలని గొప్ప ఆలోచన చేశారని చెప్పారు. ఈ కార్యక్రమానికి రూ. 1.41 లక్షల కోట్లను ప్రధాన మంత్రి వ్యయం చేశారని వివరించారు. డిప్యూటీ మేయర్ షేక్ సజీల మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవ గొప్ప సేవ అన్నారు. కోవిడ్ సమయంలో సైతం పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు అపురూపమన్నారు. ఈ కార్యక్రమం లో ఎపి ఐడిసి అధ్యక్షులు డి. ప్రభాకర్, ఏపి లీడ్ క్యాప్ అధ్యక్షులు పిల్లి మాణిక్య రావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సభ్యులు ఆరుద్ర భూలక్ష్మి, గౌడ కార్పొరేషన్ సభ్యులు లక్ష్మీ శైలజ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్. ఎస్. కె. ఖాజా వలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతి బసు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా పంచాయతీ అధికారి బి. వి. నాగ సాయి కుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు గాదె వెంకటేశ్వరరావు, చెరుకూరి తిరుపతి రావు, జిల్లా అధికారులు, కార్పొరేటర్లు, అవార్డు గ్రహీతలు, తదితరులు పాల్గొన్నారు.

# అప్పిరెడ్డి జన్మదినం - అందరికీ పర్వదినం

○ గుంటూరులో ఘనంగా లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

○ వాడవాడలా వినూత్న సేవా కార్యక్రమాలు

○ అంబరాన్నంటిన అభిమానుల సంబరాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: ప్రజాబలంతో ఎదిగిన శక్తివంతమైన ప్రజానేత.. సమర్ధవంతమైన రాజకీయ వేత్త.. విద్యార్థులను ఆదుకునే విద్యా దాత.. యువతకు భవిత.. ఎందరికో స్ఫూర్తి ప్రదాత.. అందరికీ చేయూత.. రాజన్న ఆశయాలు – జగనన్న ఆదర్శాలు కలబోత.. నిర్మలత.. నిరాడంబరత.. నిరంతర సేవా తత్పరత.. ఆత్మీయత.. ఆప్యాయత.. తదితర ప్రత్యేకతలతో ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాముఖ్యత నిచ్చే విశిష్టత సొంతంగా గల శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వేడుకలు గుంటూరులో ఘనంగా జరిగాయి.

లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు అంటే అటు ఆయన అభిమానులకే కాక ఇటు వైసీపీ శ్రేణులకు సైతం పర్వదినమేనని చెప్పాలి. మరే ఇతర నాయకుడికీ ఎప్పుడూ.. ఎక్కడా.. జరగని విధంగా గుంటూరులోని అన్ని డివిజన్లకు చెందిన 117 ప్రాంతాలలో వినూత్న సేవా కార్యక్రమాలు, అన్నదానాలు, దుస్తులు, చీరలు, నిత్యావసర సరుకులు, పండ్లు, మిఠాయిల పంపిణీలతో.. అంబరాన్నంటిన అభిమానుల సంబరాల నడుమ పెద్ద ఎత్తున జరిగిన ఆయన జన్మదినోత్సవ వేడుకలే అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

ఈ సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం సర్వ మత ప్రార్ధనలతో వేడుకలు మొదలయ్యాయి. అనంతరం ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్ చేశారు. వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గెడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. షేక్ రబ్బానీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు దువా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ ఛైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), రాష్ట్ర యువజన నేత నూనె ఉమామహేశ్వరరెడ్డి, వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు షేక్ మస్తాన్‌వలి, గులాం రసూల్, బత్తుల దేవానంద్, డాక్టర్ పోలే ముత్యం, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, పార్టీ నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఇద్దరికి ఎల్‌వోసీ చెక్కులు పంపిణీ



○ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో చెక్కులు పంపిణీ చేసిన నాయకులు

**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్)**: అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్థానిక నాయకులు సోమవారం బాధితులకు అందజేశారు. ఎన్‌సీసీ రోడ్డుకు చెందిన కొండా శ్రీనుకు రూ. 2 లక్షలు, బాపూజీ నగర్‌కు చెందిన నాగేళ్ల మణికంఠకు రూ. లక్షా 20 వేల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ) చెక్కులను అందజేశారు. ఎల్‌వోసీ చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్ కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, రాష్ట్ర పద్మశాలియ సాధికార కమిటీ సభ్యులు ఊట్ల శ్రీమన్నారాయణ, 24వ వార్డు అధ్యక్షులు గంజి చంద్రశేఖర్, శ్రీలక్ష్మీనరసింహ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గుంటి నాగరాజు, వడిశా నరేష్, నక్కా రాజశేఖర్, కనకరాజు, మరి ఏసుబాబు, పిన్నిబోయిన నరేంద్ర, వెలుగోటు అన్నపూర్ణమ్మ, దామర్ల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్టీ రెండు స్లాబుల విధానం ప్రజలకు బహుళ ప్రయోజనకరం



○ జిఎస్టీ అడిషనల్ కమీషనర్ ఎమ్ వి. ముత్యాలరావు

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** జీఎస్టీ రెండు స్లాబుల విధానం ద్వారా ముడి సరుకుల ధరలు తగ్గడంతో, ఉత్పత్తి ద్వారా వచ్చే వస్తువుల ధరలు కూడా వినియోగ దారులకు తక్కువ ధరకు లభిస్తాయని డ్వాక్రా స్టాల్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిఎస్టి అడిషనల్ కమిషనర్ ఎంవి. ముత్యాలరావు పేర్కొన్నారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం జీఎస్టీ రెండు స్లాబుల విధానం ద్వారా వనగూరె ప్రయోజనాల, అవగాహన కార్యక్రమంలో భాగంగా, డ్వాక్రా మహిళల స్టాల్స్ ఏర్పాటు చేశారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ విధానంతో, ఎమ్ ఎస్ ఎమ్ ఇ, చిన్న తరహా వ్యాపారుల ఉత్పత్తులను, చేనేత ఉత్పత్తులను స్టాల్స్ ద్వారా ఎగ్జిబిషన్ సేల్ నిర్వహించారు. మండల తాసిల్దార్ కెవి గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోటి దీప్తి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ఎంవీ ముత్యాలరావు డిఆర్డీఏ ఏపీఎం కే జయశ్రీ, స్టాల్స్ పరిశీలించి, జిఎస్టి రెండు స్లాబులు విధానం ద్వారా చిరు వ్యాపారులకు లభించే ప్రయోజనాలను వివరించారు. భవిష్యత్తులో ఈ విధానాన్ని ఒకే స్లాబ్ కిందకు తీసుకొచ్చే అవకాశం కూడా ఉందన్నారు. స్టాల్స్ ద్వారా ఆర్గానిక్ పంటలు, ఆర్గానిక్ ఎరువులు,, కారంపొడులు, డ్రై ఫ్రూట్ ఐటమ్స్, మిల్లెట్ బిస్కెట్లు, చేనేత వస్త్రాలు ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు, వినియోగ దారులు పాల్గొన్నారు.

## 12న ఉచిత మెగా నేత్రవైద్యశిబిరం



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** ఉచితవైద్యసేవా కార్యక్రమాలలో నేత్ర వైద్యశిబిరానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉన్న నేపథ్యంలో శ్రీసవీ సేవాసమితి తెనాలి శాఖ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం, ఈనెల 12న, నిర్వహించనున్నట్లు, జిల్లా ఆర్యవైశ్యసంఘ అద్యక్షులు, శ్రీ వాసవి సేవా సమితి కార్యదర్శి పెండ్యాల సుబ్బారావు పేర్కొన్నారు.

స్థానిక గంగానమ్మపేటలోని ఆర్టీసీ డిపో సమీపంలో గల, వైశ్య విద్యానిధి హాస్టల్ ప్రాంగణం నందు, సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాసవి సేవా సమితి కార్యదర్శి పెండ్యాల సుబ్బారావు మాట్లాడుతూ పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అందత్వ నివారణ సంస్థ, వాసవి సేవా సమితి సంయుక్త నిర్వహణలో, ఉచిత నేత్ర వైద్య శిబిరం ఈనెల 12వ తేదీ ఆదివారం, వైశ్య విద్యానిధి హాస్టల్ ప్రాంగణంలో, నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఆపరేషన్లు, అదే రోజు సాయంత్రం, శంకర కంటి ఆసుపత్రికి తీసుకువెళ్లి ఉచితముగా శుక్లములకు ఆపరేషన్లు చేస్తారని, మరుసటి రోజు సాయంత్రానికి వైశ్య విద్యార్థి హాస్టల్ కు, తీసుకు వస్తారని తెలిపారు. ఈ నేత్రవైద్య సేవలు అన్ని ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వృద్ధాప్యంలో, కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న పేద మధ్యతరగతి కుటుంబాల వారు ఉచిత నేత్ర వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీ వాసవి సేవా సమితి అధ్యక్షులు వరద వెంకట శేషగిరిరావు మాట్లాడుతూ నేత్ర వైద్య పరీక్షలకు వచ్చేవారు విధిగా ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు తమ సంస్థ ద్వారా 13 నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి, 10వేల మందికి కంటి ఆపరేషన్లు చేయించామని తెలిపారు. అనంతరం ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో శ్రీ వాసవి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## రాజస్థాన్ రాష్ట్ర ప్రణాళిక అధికారులకు సమావేశం



❍ సమావేశం నిర్వహించిన లంకా దినకర్

**అమరావతి,(జర్నలిస్ట్ ఫైల్)** రాష్ట్ర 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ ఆధ్వర్యంలో ఎపి సోమవారం సచివాలయంలో సమావేశం జరిగింది. ఈసమావేశంలో వికసిత్ భారత్ 2047 లో భాగంగా స్వర్ణాంధ్ర విజన్ ప్రణాళిక అమలును రాజస్థాన్ బృందానికి లంకా దినకర్ వివరించారు. సోషల్ సెక్యూరిటీ ఫించన్లు పంపిణీలో దేశంలో ఎపి అగ్రస్థానంలో ఉందని వివరించారు. 974 కిమీ.ల సముద్ర తీరం గల ఎపిలో అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నట్టు దినకర్ రాజస్థాన్ బృందానికి వివరించారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్, రాజస్థాన్ ప్రణాళికా శాఖ ప్రతినిధి బృందంలో చేతన్ ప్రకాశ్ మాండవర్, నిర్మల్ సేతి, వినేశ్ సింగ్ సహా రాష్ట్ర ప్రణాళికా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి



❍ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించిన కమిషనర్

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :గుంటూరు నగరపాలక సంస్థ ప్రతి సోమవారం జరిగే పిజిఆర్ఎస్ కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని కమిషనర్ గారు అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. సోమవారం జరిగే కార్యక్రమానికి క్షేత్ర స్థాయి అధికారులు కూడా హాజరైతే సమస్యల పరిష్కారం తేలికవుతుందని పేర్కొన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. అర్జీల పరిష్కారంపై జివిఎంసి పిఎంయు బృందం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 28 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 7, ఇంజినీరింగ్ విభాగం 8, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 7, పరిపాలన విభాగం 1 , అకౌంట్స్ విభాగానికి సంబంధించి 1 ఫిర్యాదు అందాయన్నారు.

కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఇంచార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాల్లో కర్ణాటక, ఆంధ్ర మధ్య మంచి సంబంధాలు

❍ నేను ఓడినప్పుడు జస్టిస్ గోపాల గౌడ వెన్నుతట్టి ధైర్యం చెప్పారు:

❍ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : భాష, ప్రాంతం పరంగా వేరుగా ఉన్నా.. సంస్కృతి-సంప్రదాయాల విషయంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మంచి సంబంధ బాంధవ్యాలున్నాయని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కర్ణాటకలోని చింతామణిలో సోమవారం జరిగిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల గౌడ 75వ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. కోలార్, చిక్కబళ్లాపుర ప్రాంతాల్లో నీటి సమస్య పరిష్కారానికి తమ వైపు నుంచి సహకారం అందిస్తామన్నారు. రూల్ ఆఫ్ లా స్థాపనలో నేటి తరానికి జస్టిస్ గోపాల గౌడ దారి చూపాలని కోరారు. తన వృత్తి జీవితాన్ని కార్మికులు, కర్షకుల కోసం అంకితం చేశారని.. ఎన్నో కీలక కేసుల్లో ఆయన ఇచ్చిన తీర్పులు చరిత్రాత్మకమని గుర్తుచేశారు. భూ సేకరణ చట్టంతో ఇబ్బందులు పడేవారి పక్షాన నిలిచారని.. ఏ ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినా అడ్డుకున్నారని తెలిపారు.

జనసేన చేపట్టిన పోరాటాల్లో జస్టిస్ గోపాల గౌడ ఇచ్చిన సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని.. 2019లో తాను ఓడిపోయిన సమయంలో వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేసుకున్నారు. ఏపీలో పంటపొలాలు నాశనం కాకుండా కర్ణాటక ప్రభుత్వం కుంకీ ఏనుగులు ఇచ్చి సహకరించిందని చెప్పారు. శ్రీశైలం దేవస్థానానికి వచ్చే కర్ణాటక భక్తులకు సౌకర్యాల విషయంలో సానుకూలంగా ఉన్నామని తెలిపారు. జస్టిస్ వి.గోపాల గౌడ మాట్లాడుతూ.. రైతులు, యువత, మహిళల అభ్యున్నతి గురించి పవన్ నిరంతరం ఆలోచిస్తారని తెలిపారు. కర్ణాటకలోని మూడు జిల్లాల్లో నీటి సమస్య ఉందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి పవన్ కల్యాణ్ ఈ సమస్య

## ఎం.ఫార్మసీ II సెమిస్టర్ (2024-25) తుది పరీక్షల ఫలితాల విడుదల




**మంగళగిరి, (జర్నలిస్ట్ ఫైల్)** : నిర్మల ఫార్మసీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో ఎం.ఫార్మసీ II సెమిస్టర్ (2024-25) తుది పరీక్షల ఫలితాలను లికళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి గారులి కళాశాల ప్రాంగణంలో విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో లిడా. బి. పాముల రెడ్డి, ప్రిన్సిపల్‌బీ డా. నరేష్ బాబు రేఖా, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌బీ షేక్ సుభాని, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌బీ డా. లక్ష్మయ్య, పీజీ కోఆర్డినేటర్‌బీ డా. జి. స్వప్న, హెచ్ఓడి - ఫార్మాస్యూటికల్ అనాలిసిస్‌బీ డా. యు. స్పందన, డీన్ అకడెమిక్స్‌బీ డా. షేక్. ఫైజాన్ అలీ, హెచ్ఓడి - ఫార్మకాలజీ & ఫార్మసీ ప్రాక్టీస్‌బీ మరియు డా. నాగరాజు, హెచ్ఓడి - ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్‌లి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి గారు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, అధ్యాపకులను మరియు పరీక్షా విభాగం చేసిన కృషిని ప్రశంసించారు. స్వయంప్రతిపత్తి కళాశాలగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను కొనసాగిస్తూ, ఉన్నత విద్యా నాణ్యతకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఈసారి ఎం.ఫార్మసీ పరీక్షల్లో విభాగాలవారీగా ఉత్తీర్ణత శాతం ఇలా ఉంది: ఫార్మాస్యూటిక్స్ - 94.1%, ఫార్మాకాలజీ - 86.6%, డ్రగ్ రెగ్యులేటరీ అఫైర్స్ - 76.4%, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ - 94.1%.

ఫలితాలను కళాశాల స్వయంప్రతిపత్తి పరీక్షల వెబ్‌సైట్‌లో చూడవచ్చు: https://ncpaexamresults.inకళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు మరియు పరీక్షా విభాగం విజయవంతంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

## ఓబన్న పోరాటం చరిత్రాత్మకం



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** బ్రిటీష్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న వీరోచిత పోరాటం, త్యాగం, వీరత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. వడ్డె ఓబన్న వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే నసీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటయోధుడు, రేనాటి ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న అని పేర్కొన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి మిత్రునిగా, ఆయన ఉద్యమానికి సైన్యాధ్యక్షునిగా భారతావని బానిస సంకెళ్లు తెంచేందుకు వీర మరణం పొందారని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తెలుగునాట తొలిసారి సవాల్ చేసిన సైరా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి తెల్ల దొరల గుండెల్లో వణుకు పుట్టించిన యోధుడని పేర్కొన్నారు. నేటి రాయలసీమగా పిలవబడే ఆనాటి రేనాటి ప్రాంతంతో ఓబన్న తండ్రి గ్రామ రక్షకునిగా పని చేశారన్నారు. అప్పట్లో గ్రామ రక్షకుల జీతాల రద్దు, రైతులపై అధిక పన్నులు, బలవంతపు శిస్తు వసూళ్లకు వ్యతిరేకంగా ఓబన్న పోరాట జెండా ఎత్తుకున్నారని వివరించారు. భారతావని కోసం ఎన్నో పోరాటాలు చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఓబన్న కేవలం 39 సంవత్సరాలకే బ్రిటీష్ దొరలతో పోరాడి వీర మరణం పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిశీలకులు గంజం రాఘవేంద్ర, కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, చల్లా ఆంజనేయ ప్రసాద్, చామర్తి ఆనంద్ సాగర్, వంగర ఏడుకొండలు, బత్తిని శంకర్, అచ్చి కిరణ్, గుంటి నరసింహారావు, %ఎవివ% హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంజేపీ స్కూళ్ల అభివృద్ధికి సహకరించండి




❍ కేంద్రమంత్రి రాందాస్ అథవాలేతో మంత్రి సవిత

**అమరావతి (జర్నలిస్టు ఫైల్)** : రాష్ట్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల(ఎంజేపీ స్కూళ్లు) అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయమంత్రి డాక్టర్ రాందాస్ అథవాలేను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత కోరారు.

రాష్ట్రంలో డి.ఎన్.టి. కులాల లబ్ధిదారులు వివిధ స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వాటికి కూడా పరిష్కారం చూపాలని కోరారు. విజయవాడలోని ఓ హెూటల్లో కేంద్రమంత్రి డాక్టర్ రాందాస్ అథవాలేను మంత్రి సవిత సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఎంజేపీ స్కూళ్ల అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేయాలని కోరారు. స్వయం ఉపాధి కోసం డి.ఎన్.టి కులాల లబ్ధిదారులు 3,700లకు పైగా దరఖాస్తులు చేసుకున్నారని, వాటికి కూడా పరిష్కారం చూపాలని కోరారు.

ఈ రెండింటితో పాటు పలు వినతులను కేంద్రమంత్రికి అందజేశారు. మంత్రి సవిత వినతులపై కేంద్రమంత్రి రాందాస్ అథవాలే సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రి సవిత వెంట రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఇతర బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

## నేడు రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతి



❍ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి

❍ కర్నూలులో రాష్ట్రస్థాయి జయంత్యోత్సవం

❍ తరలిరానున్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

**అమరావతి,(జర్నలిస్టు ఫైల్)** : నేడు.మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది నుంచి మహర్షి వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందన్నారు. అక్టోబర్ ఏడో తేదీన మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ కలెక్టర్ల నేతృత్వంలో వాల్మీకి జయింతిని నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో రాష్ట్ర స్థాయి వాల్మీకి జయంత్యోత్సవాన్ని చేపట్టనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారన్నారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని యువగళం పాదయాత్రలో మంత్రి లోకేశ్‌కు అప్పట్లో భారీ సంఖ్యలో వినతులు అందాయన్నారు. ఈ నేపథ్యంలో బీసీల ఆత్మగౌరవానికి ప్రాముఖ్యతనిస్తూ, ఇచ్చిన హామీని నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా వాల్మీకి జయంతిని నిర్వహించాలని నిర్ణయం తీసుకుందని

# ఎస్ఆర్ఎంలో...ప్రతిభకు పట్టం... సేవలకు గుర్తింపు













❍ బోధన, పరిశోధనల్లో మేటి ప్రొఫెసర్లకు అవార్డులు

❍ ఒక్కొక్కరికి రూ.50 వేల నగదు పారితోషికం

❍ డాక్టర్ అనిర్బన్ కి ఆచార్య తివారీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డ్

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్)** : ప్రతిభ గల ప్రొఫెసర్లకు ఏపీ ఎస్ ఆర్ ఎం యూనివర్సిటీ సముచిత గౌరవాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తోంది. బోధన, పరిశోధన రంగాల్లో అవిశ్రాంతంగా శ్రమిస్తూ విద్యార్థుల ఉజ్వల భవితకు, యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడే అధ్యాపకులకు పెద్దపీట వేస్తోంది. సకాలంలో వారికి పదోన్నతులు కల్పించడమే కాకుండా ఏటా ఉత్తమ అధ్యాపక అవార్డులను అందిస్తోంది. ఈ ఏడారి జరిగిన గురుపూజోత్సవం సందర్భంగా యూనివర్సిటీలో పనిచేసే 10 మంది ప్రొఫెసర్లకు అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీ అవార్డులను ప్రధానం చేసింది. ఈ అవార్డు కింద ఒక్కొక్కరికీ రూ.50 వేల నగదు పారితోషికం , జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ప్రధానం చేసింది. బోధన, పరిశోధనలతో పాటు ఆధ్యానికునిగా చేరిన నాటి నుంచి ఇప్పటి వరకూ యూనివర్సిటీలో వివిధ రంగాల్లో అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులకు ఎంపిక చేసింది. ఇటీవల యూనివర్సిటీ అడిటో రియంలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. ఈ తరహా అవార్డులను అందజేస్తున్న ఏకైక ప్రయివేటు యూనివర్సిటీ ఎస్ఆర్ఎం ఒక్కటే. యూనివర్సిటీ ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ పురస్కారాలకు ఎంపికైన వారి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

**డాక్టర్ అనిర్బన్ ఘోష్:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్గా ఆరేళ్ల నుంచి పనిచేస్తున్న డాక్టర్ అనిర్బన్ నార్త్ డకోట స్టేట్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 'ఏపీ ఎస్ ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్ డాక్టర్ ఘోష్ విశేషమైన సేవలను అందిస్తున్నారు. పాఠ్య ప్రణాళిక రూపకల్పన, పరిశోధనా పత్రాల తయారీలో కృషి చేశారు. అడ్వాన్స్ టీచింగ్ లేబొరెటరీల ఏర్పాటు, ఆకడమిక్ కొలాబరిషన్స్ లో డాక్టర్ కీలక పాత్ర పోషించారు.

**ప్రొఫెసర్ వడ్డి రమేష్:** రూర్కీలో పీహెచ్ డీ పూర్తి చేసిన ప్రొఫెసర్ వడ్డి రమేష్ 2019లో ఎస్ఆర్ఎం వర్సటీలో ప్రొఫెసర్ గా జాయిన్ అయ్యారు. బోధనలో విశేషమైన అనుభవాన్ని సంపాదించుకున్న ప్రొఫెసర్ పాఠ్యాంశాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించారు. విద్యార్థుల్లో నూతన సృజనల ప్రేరణకు ఎంతో కృషి చేస్తున్నారు.

**డాక్టర్ వినీత్ థామస్:** ఇండియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ లో సభ్యునిగా కొనసాగుతున్న డాక్టర్ వినీత్ యూజీసీ జూనియర్ రీసెర్స్ ఫెలోషిప్ ను అందుకున్నారు. వీరి పరిశోధనా పత్రాలు క్యూ వన్ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఉత్తను భోధకునిగా, పరిశోధకునిగా గుర్తింపు కలిగిన డాక్టర్ వినీత్ ఈ ఏడాది యూనిర్సిటీ అవుట్ స్టాండింగ్ ఫ్యాకల్టీగా ఆవార్డును అందుకున్నారు.

**డాక్టర్ తౌసిఫ్ ఖాన్:** గడచిన ఆరేళ్లుగా యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డాక్టర్ తౌసిఫ్ ఖాన్ పాఠ్యాంశాల బోధనలోను పరిశోధనలోనూ తనదైన ప్రతిభ చూపుతూ అటు విద్యార్థులకు ఇటు వర్సిటీ యాజమాన్యానికి దగ్గరయ్యారు. యంగ్ రీసర్చ్చెర్ అవార్డుతో పాటు అబ్దుల్ కలాం అవార్డులను ప్రభుత్వం నుంచి అందుకున్నారు సుమారు 25 అంతర్జాతీయ జర్నల్స్ లో ఈయన పరిశోధన పత్రాలు ప్రచురితం అయ్యాయి.

**డాక్టర్ ఎస్ సుమలత:** ఎన్ఐటి వరంగల్ లో పీహెచ్డీ పూర్తి చేసిన డాక్టర్ సుమలత గడచిన ఐదేళ్లుగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో కంప్యూటర్ సెన్స్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నారు. పరిశోధన పూర్వక పత్రాల రూపకల్పనలో విశేషమైన ప్రతిభను కనబరుస్తున్న డాక్టర్ సుమలత నూతన సృజనలకు ప్రాణం పోస్తున్నారు యూనివర్సిటీలోని డిసిప్లినరీ డిఆర్సిసి కమిటీల్లోను సభ్యురాలుగా కొనసాగుతున్నారు ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ యాజమాన్యం ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.

**డాక్టర్ ప్రజ్యూత్ కుమార్ సాంకి:** ఖరగ్పూర్ ఐఐటీలో పీహెచ్డీ పూర్తిచేసిన డాక్టర్ ప్రచుద్ కుమార్ సాంగ్ కి నాలుగేళ్ల కిందట ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా జాయిన్ అయ్యారు ఇప్పటివరకు 22 కు పైగా పరిశోధన పత్రాలకు పేటెంట్స్ గ్రాండ్స్ లభించాయి. బ్లడ్ గ్లూకోజ్ మానిటరింగ్ డివైస్ తయారీ, పని విధానంలో ప్రతిభను కనబరుస్తున్నారు . ఈ నేపథ్యంలో ఆయన విశేషమైన సేవలను గుర్తించిన యూనివర్సిటీ ఈ ఏడాది బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డుకు ఎంపిక చేసింది.

**డాక్టర్ లలిత్ మోహన్:** మద్రాస్ ఐఐటీలో పీహెచ్డీ పూర్తి చేసిన డాక్టర్ లలిత మోహన్ ఎస్ఆర్ఎమ్ లో అధ్యాపకునిగా జాయిన్ అయ్యారు సృజనాత్మక కోర్సుల రూపకల్పన లో డాక్టర్ లలిత్ దిట్ట యూనివర్సిటీలో జరిగిన మొదటి రీసెర్చ్ స్కాలర్స్ సదస్సుకు కో కన్వీనర్ గా వ్యవహరించారు డాక్టర్ లలిత్ పనితీరుకు ప్రోత్సాహంగా యూనివర్సిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

**డాక్టర్ సునీత:** చెన్నై ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో పిహెచ్డి పూర్తి చేసిన డాక్టర్ సునీత ప్రస్తుతం ఏపీఎస్ఆర్ యూనివర్సిటీలో ఈసీఈ విభు విభాగాధిపతిగా పనిచేస్తున్నారు . ఎయిమ్స్ మంగళగిరి, ఐజీ కార్ ( కల్పకం )ల భాగస్వామ్య సహకారంతో గ్రామీణ ప్రాంత మహిళల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు తరగతి గదిలో పాటలు మాత్రమే విద్యార్థులు ఉన్నతికి దోహద పడవని సామాజిక సేవా కార్యక్రమాలు కూడా అవసరమని డాక్టర్ సునీత అభిప్రాయపడుతున్నారు ఈ నేపథ్యంలో ఆమె సేవలను గుర్తించిన యూనివర్సిటీ ఈ ఏడాది బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డుకు ఎంపిక చేసింది.

**డాక్టర్ జావిద్:** ఎన్విరాన్మెంటల్ సైన్స్ లో విశేషమైన బోధన అనుభవం కలిగిన డాక్టర్ జావిద్ పాండిచ్చేరి యూనివర్సిటీ నుంచి పీహెచ్డీ పట్టాను అందుకున్నారు. పరిశోధకులుగా మెంటార్గా మంచి పేరున వ్యక్తి విద్యాబోధనలో ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డును అందజేసింది.

**డాక్టర్ జతీష్ కుమార్ దాస్:** సుమారు ఆరేళ్ల నుంచి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో అధ్యాపకునిగా పనిచేస్తున్న డాక్టర్ జతీష్ కుమార్ దాస్ చిన్న వయసులోనే మంచి ఫ్యాకల్టీగా గుర్తింపు తెచ్చుకున్నారు. క్రమశిక్షణతో కూడిన బోధన విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని డాక్టర్ జతీష్ అభిప్రాయపడుతున్నారు. డాక్టర్ జతీష్ అందించిన సేవలకు గుర్తింపుగా యాజమాన్యం బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డు ను ప్రకటించింది.

**డాక్టర్ భగత్ సింగ్:** డాక్టర్ భగత్ సింగ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు . చీఫ్ వార్డన్ గాను విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులను సమీక్షిస్తున్నారు యూనివర్సిటీ వాతావరణన్ని మరింత ఇనుమడింపజేసే క్రమంలో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467